## ఐటీ పార్క్ నిర్మించాల్సిన చోట డంపింగ్ యార్డా?..

2లో..




# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం, 07 జూలై-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## హమాలీ సోదరుల రుణం తప్పకుండా తీర్చుకుంటా



మిగతా 2లో..

# 600 డ్రోన్లతో ఉక్రెయిన్ అటాక్..

- తిప్పికొట్టిన రష్యా



మాస్కో : ఉక్రెయిన్ విస్తృత స్థాయిలో రష్యాపై డ్రోన్ దాడి చేసింది. సుమారు 600 డ్రోన్లతో అటాక్ చేసినట్లు రష్యా రక్షణ శాఖ పేర్కొన్నది. అయితే తమ వైమానిక రక్షణ దళం ఆ డ్రోన్ల ను కూల్చివేసినట్లు మాస్కోలోని రష్యా రక్షణ శాఖ పేర్కొన్నది. సుమారు 20 ప్రాం తాల్లో ఎలక్ట్రానిక్ పద్ధతుల్లో ఆ డ్రోన్లను నేలకూల్చినట్లు రష్యా వెల్లడించింది. మాస్కో, లెనిన్‌గ్రాడ్, క్రస్నోడార్, బెల్‌గోరోడ్, సమ రా, వోల్గోగ్రాడ్, క్రిమియా, అజోవ్ సముద్రంపై ఆ అటాక్ జరిగింది. మాస్కో మీదకు వచ్చిన సుమారు 11 యూఏవీలను కూల్చివే సినట్లు ఆ నగర మేయర్ సెర్గీ సోబియానియన్ తెలిపారు.డ్రోన్ల దాడి వల్ల క్రిమియాలో బ్లాకౌట్ ఏర్పడింది. స్థానిక ఎలక్ట్రిక్ గ్రిడ్ ఆపరేటర్ దెబ్బతిన్నది. హై వోల్టేజ్ నెట్వర్క్‌ను టార్గెట్ చేయడం వల్ల అన్ని నగరాలు, జిల్లాలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. సుదీర్ఘ దూరం ప్రయాణించే యూఏవీలతో ఇంధన కేంద్రాలను కీవ్ టార్గెట్ చేసినట్లు రష్యా చెప్పింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడివల్ల.. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్న పోర్టు దెబ్బతిన్నది. అక్కడున్న ఆయిల్ కంపెనీ నుంచి నల్లటి పొగ వ్యాపిస్తున్నది. సమీపంలో ఉన్న మిలిటరీ టార్గెట్లను కూడా ధ్వంసం చేసినట్లు ఉక్రెయిన్ చెప్పింది. రాజధాని మాస్కోపైనే సుమారు 200 డ్రోన్లతో దాడి జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. రష్యాలో చాలా సుదూర ప్రాంతాల్లో ఉన్న ఆయిల్ కంపెనీ కేంద్రాలపై కూడా ఉక్రెయిన్ దాడి చేయడం గమనార్హం. ఉక్రెయిన్ తాజాడ్రోన్‌దాడులతో..రష్యాలో కొత్త తరహా యుద్ధం మొదలైంది. మీడియం రేంజ్ డ్రోన్లతో రష్యా లాజిస్టిక్స్‌ను ఉక్రెయిన్ క్రమంగా టార్గెట్ చేస్తోంది. క్రిమియాలో ఇంధన కొరత ఏర్పడడంతో ఎమర్జెన్సీ ప్రకటించారు.

# రాజకీయకక్షతోనే కాళేశ్వరం ఎత్తిపోతల నిలుపుదల!



హైదరాబాద్, జూలై 06 : 'ఒక అబద్ధాన్ని కప్పిపుచ్చేందుకు వంద అబద్ధాలు ఆడుతారు' అనడానికి కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ వైఖరే నిదర్శనం. కేవలం రెండు పిల్లర్లు కుంగిపోగా.. మొత్తం ప్రాజెక్టే కూలిపోయిందని మొదట ప్రచారం చేసింది కాంగ్రెస్. దాన్ని నిజమని నిరూపించేందుకు పూటకో మాట, రోజుకో అబద్ధం చెప్తున్నది. తెలంగాణ వరప్రదాయినిగా పిలిచే ప్రాజెక్టును రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాజకీయకక్షతో పడావు పెట్టింది. తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు అబద్ధాల్లో మునిగితేలుతున్నది. తాజాగా నీటిని నిల్వ చేస్తే అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు కూలిపోతాయంటూ అసత్య ప్రచారానికి పూనుకున్నది. దిగువన భద్రాచలం మునుగుతుందని దుష్ప్రచారం మొదలు పెట్టింది. కుంటిసాకులు చెప్తూ కన్నెపల్లి పంపులను ఆన్ చేయకుండా, ప్రాణహిత జలాలను దిగువకు వృథాగా వదిలేస్తున్నది. ఫలితంగా లక్షల ఎకరాలకు సాగు నీరందించే అవకాశాన్ని వదిలిపెట్టి రాష్ట్ర రైతులను నిండా ముంచుతున్నది. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నదిలో ఇప్పటికే 20 టీఎంసీల జలాలు దిగువకు వృథాగా వెళ్లిపోయాయని అధికార వర్గాలు చెప్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ (లక్ష్మీబరాజ్) బరాజ్ 7వ బ్లాక్‌లో 20పిల్లర్ కుంగుబాటుకు గురైన విషయం తెలిసిందే. అక్కడ తప్ప మిగతా బ్లాకులన్నీ సేఫ్‌గా ఉన్నాయి. అంతేకాకుండా బరాజ్‌కు కుంగుబాటునకు కారణమైన 7వ బ్లాక్ ఆఫ్‌స్ట్రీమ్‌లోని 400క్యూబిక్ మీటర్ల బొయ్యారాన్ని ఇప్పటికే సిమెంట్, ఇసుక మిశ్రమంతో గ్రౌటింగ్ చేసి పూడ్చివేశారు. బరాజ్ ఫౌండేషన్ కిందనున్న సీకెంట్ పైల్స్‌ను రక్షణగా మళ్లీ కొత్తగా ఏర్పాటు చేశారు.

మిగతా 3లో..

## మక్కలు అమ్మిన రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో గల్లంతు!



- ఖమ్మం మార్క్‌ఫెడ్ అధికారుల నిర్లక్ష్యం
- డబ్బులు రాక బాధిత రైతుల ఆందోళన
- మార్క్‌ఫెడ్ ఆఫీస్ సిబ్బందిని నిలదీసిన రైతులు

హైదరాబాద్, జూలై 06 : ఖమ్మం జిల్లాలో మార్క్‌ఫెడ్ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. జిల్లాలోని తిరుమలాయపాలెం సహకార సొసైటీ, మార్క్‌ఫెడ్ అధికారుల సమన్వయ లోపం కారణంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో మక్కజొన్నలు అమ్ముకున్న రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో గల్లంతై వారి ఖాతాల్లో డబ్బులు పడకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడుకు చెందిన పలువురు రైతులు గత మే 10న తిరుమలాయపాలెం

మిగతా 3లో..

## 70 వేలు లంచం తీసుకుంటూ..

- ఏసీబీకి చిక్కిన చేర్యాల తహసీల్దార్



చేర్యాల, జూలై 6 : సిద్దిపేట జిల్లా చేర్యాల తహసీల్దార్ దిలీప్‌నాయక్ రూ. 70 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ వెల్లడించిన వివరాల ప్రకా రం.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం నాగ పురి గ్రామ పరిధిలోని 30 గుంటల భూమికి సంబంధించిన 11 నాలా కన్వర్షన్లకు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు.వీటిని ప్రాసెస్ చేసేందుకు లబ్ధిదారుల నుంచి తహసీల్దార్ దిలీప్‌నాయక్ రూ. 70 వేలు డిమాండ్ చేశాడు. సోమవారం తహసీల్ ఆఫీస్‌లో లబ్ధిదారుల నుంచి లంచం తీసుకుంటుండగా తహసీల్దార్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

## నిరుద్యోగుల జంగ్ సైరన్..



మిగతా 2లో..


## బండి సంజయ్‌కు కీలక బాధ్యతలు



- మోదీ టీంలో తెలంగాణ నుంచి కీలక మార్పులు..!!

హైదరాబాద్, జూలై 06 : ప్రధాని మోదీ పాలనా-పార్టీ పరంగా పూర్తిగా ప్రక్షాళన దిశగా కసరత్తు చేస్తున్నారు. త్వరలో జరిగే కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు... మోదీ 4.0 టార్గెట్ గా ఈ మార్పులు చేర్పులకు రంగం సిద్ధం చేస్తు న్నారు. ప్రభుత్వంతో పాటుగా పార్టీలోనూ మార్పులు జరగనున్నాయి. పలువరు సీనియర్ల శాఖలు మారటంతో పాటుగా.. కొందరు మంత్రులకు ఉద్వాసన ఖాయంగా కనిపిస్తోంది. ఇక, తెలంగాణ నుంచి కేబినెట్‌లో ఇన్-అవుట్ పైనా దాదాపు స్పష్టత వస్తోంది. కేంద్ర కేబినెట్ ప్రక్షాళన కసరత్తు తుది దశకు చేరుకుంది. బీజేపీ జాతీయ నూతన కార్యవర్గంతో పా టుగా కేబినెట్ లో మార్పుల దిశగా ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారు. ప్రస్తుతం కేంద్ర మంత్రు లు ఇద్ద రికి గవర్నర్ హోదా దక్కనుంది. 12 మందిని కేబినెట్ నుంచి తప్పించేందుకు రంగం సిద్ధమైంది. కేంద్ర కేబినెట్ వర్షాకాల పార్లమె ంట్ సమావేశాలకు ముందే జరగటం ఖా యమైంది. కేబినెట్ లో కొందరు సీనియర్లకు

## వాయుగుండంగా మారిన అల్పపీడనం



హైదరాబాద్, జూలై 06 : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం, చురుకైన రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, మెదక్ జిల్లాల్లో భారీ వర్షాలు, గాలులు వీచే అవకాశం ఉన్నట్టు తెలిపింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వర్షపాతం పుంజుకొనే సూచనలు కనిపిస్తున్నట్టు చెప్పారు.

## జిల్లాల్లో డ్రగ్స్ నియంత్రణ రాష్ట్రానికి అత్యంత కీలకం..!

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల పనితీరు అభినందనీయం
- డీజీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్, జూలై 06 : భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో డ్రగ్స్‌ను నియంత్రించడం రాష్ట్రానికి అత్యంత కీలకమని డీజీపీ సీవీ ఆనంద్‌అన్నారు. 2029 డిసెంబర్ నాటికి తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరమని వెల్లడించిన డీజీపీ.. కేసుల దర్యాప్తు వేగవంతం చేసి కన్విక్షన్ రేటు పెంచాలని సూచించారు.సీసీటీఎన్ఎస్‌లో పూర్తి స్థాయిలో డేటా అప్‌లోడ్ చేసి విచారణను వేగవంతం చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. డ్రగ్స్ సరఫరా చేసే నెట్‌వర్క్‌పై దేశ దేశవ్యాప్తంగా ఈగిల్

మిగతా 3లో..

## పర్యాటక ప్రాంతంగా దుర్గం చెరువు

### తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్



హైదరాబాద్, జూలై 06 : పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని అధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశించారు. దుర్గం చెరువును పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని అధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశించారు. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లోని పర్యాటక కేంద్రాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలని అధికారులను నిర్దేశించారు. వికారాబాద్‌లోని వీరభద్రస్వామి దేవాలయాన్ని డెవలప్ చేసి యాదాద్రి తరహాలో ఆలయానికి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణలో పర్యాటక రంగ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా హైదరా బాద్‌లోని పర్యాటక ప్రాంతాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు.గొల్కొండ సమీపంలోని తారామతి బారాదరిని టూరిజం ప్రాంతంగా మరింత అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీక రించాలని ఆదేశించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వికారాబాద్‌లోని వీరభద్రస్వామి దేవాలయాన్ని డెవలప్ చేసి యాదాద్రి తరహాలో ఆలయానికి కమిటీ ఏర్పాటు చేయాలని

మిగతా 3లో..

# రేవంత్ సర్కార్ రికార్డు



- రైతు భరోసా నిధుల పంపిణీలో సరికొత్త మైలురాయి!
- రైతు భరోసా నిధుల పంపిణీ ఏకంగా 46శాతం పెరుగుదల
- రెండేళ్లలో 23,070 కోట్ల రూపాయలు లబ్ధిదారులకు విడుదల

హైదరాబాద్, జూలై 06 : తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నలకు అండదండగా ఉండడానికి అన్ని విధాలా చర్యలు చేపడుతుంది. రైతు సంక్షేమం కోసం రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం పంట పెట్టుబడిసాయం అందించే రైతు భరోసా విషయంలో సరికొత్త మైలురాయిని అధిగమించింది. గత బీ ఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వంలో రైతుబంధు గా ప్రారంభమైన ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రస్తుతం రైతు భరోసాగా కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఈ పథకం కింద ప్రభుత్వం రైతులకు అందించిన మొత్తం నిధుల పంపిణీ ఏకంగా 46 శాతం పెరిగింది. దీంతో ఈ మొత్తం 73,320 కోట్ల రూపాయలకు చేరుకుంది. ప్రభుత్వ అధికారిక డేటా ప్రకారం 2018లో ఈ పథకం ప్రారంభించినప్పుడు కేవలం భూమి ఉన్న సుమారు 58 లక్షల మంది రైతులకు మాత్రమే పెట్టుబడి సహాయం అందేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం పరిధిని మరింత విస్తృతం చేయడంతో కౌలు రైతులను, వ్యవసాయ కూలీలను కూడా ఇందులో భాగస్వామ్యం చేయడంతో ప్రస్తుతం ఈ పథకంలో లబ్ధిదారుల సంఖ్య 73లక్షల మార్కును చేరుకుంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లకాలంలో 50,250 కోట్ల

మిగతా 3లో..

## సంగారెడ్డి కలెక్టరేట్ ముట్టడి

### విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్



సంగారెడ్డి, జూలై 6: విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. కలెక్టరేట్ ప్రవేశ ద్వారం నుంచి ప్రాంగణంలోకి వెళ్లారు. దీంతో కలెక్టరేట్‌లోని ఏబ్లాక్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది.విద్యార్థులు లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. దీంతో శాంతించిన విద్యార్థులు అక్కడే బైఠాయించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజేశ్, కార్యదర్శి సతీశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేయకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఫీజు నియంత్రణ చట్టం లేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని మండిపడ్డారు. వెంటనే ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అర్జున్, లక్ష్మణ్, వాణి, రిషీ, సందీప్, బుచ్చిబాబు, వరుణ్, శ్రావణి, అభిషేక్, రాజు, రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోక్సో నిందితుడు పరారీ..




### విస్తృతంగా పోలీసుల గాలింపు

**మహబూబ్‌నగర్, జూలై 06 :** మైనర్ బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసులో మహబూబ్‌నగర్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నిందితుడు ఒకరు జైలు నుంచి పారిపోయిన విషయం జిల్లాలో సంచలనం కలిగించింది. వనపర్తి జిల్లా అమరచింత మండలం నందిమల్ల గ్రామానికి చెందిన కిషోర్ రెడ్డి మైనర్ బాలికను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని అమ్మాయి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అతడిపై పోక్సో కేసు నమోదు అయింది.దీంతో అతడు 25 రోజులుగా మహబూబ్‌నగర్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. ఇదిలా ఉండగా జైలు నుంచి పరారీ కావడానికి కిషోర్ అనేక సార్లు రెక్కి నిర్వహించినట్లు తెలుస్తోంది. తోటి ఖైదీల టవళ్లను( ఃశీషవశ్రీం ) తీసుకొని బాత్‌రూం ఎక్కి అక్కడి నుంచి గోడ మీదకు చేరి టవళ్లను ఒకదానికొకటి కట్టి 18 ఫీట్ల గోడ దాటుకొని కిందికి దిగి పరారీ అయినట్లు జైలు సిబ్బంది గుర్తించారు.అనంతరం జైలు అధికారులు వెంటనే స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అటు జైలు సిబ్బంది, పోలీసులు సమీప ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు స్వగ్రామానికి చేరుకుని ఉంటాడని ఆత్మకూరు పోలీసులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా జైలు నుంచి పరారైన కిషోర్ తల్లిదండ్రులకు ఫోన్‌కాల్ చేసినట్లు గుర్తించారు. జైలు నుంచి పారిపోయి ఇంటికి వస్తున్నానని సమాచారం ఇవ్వగా తల్లిదండ్రులు వారించారు.పరారీ విషయం తెలుసుకున్న జైళ్ల శాఖ డీఐజీ గోప్యంగా విచారణ జరిపి వెళ్లినట్లు సమాచారం. అయితే మహబూబ్‌నగర్ జైలు నుంచి ఖైదీ పరారైనట్లు జైలు శాఖ నుంచి తమకు ఫిర్యాదు అందిందని వన్ టౌన్ ఎస్సై శీనయ్య మీడియాకు వివరించారు.

# పులిచింతల జెన్‌కో ప్రాజెక్టు వద్ద ఉద్రిక్తత



**చింతలపాలెం జూలై 06 :** పులిచింతల జెన్‌కో ప్రా జెక్టు వద్ద ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. పులిచింతల జెన్‌కో ప్రాజెక్టులో వజినేపల్లి గ్రామానికి చెందిన కొందరు స్థానిక కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించినట్లు సమాచారం. దీనికి నిరసనగా బాధిత కార్మికుల కుటుంబ సభ్యులు ప్రాజెక్టు వద్ద ధర్నాకు దిగారు.ధర్నా సందర్భంగా కొందరు తమపై పెట్రోల్ పోసుకుని ఆత్మాహత్యాయత్నానికి ప్రయ త్నించారు.దీంతో ఘటనతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన కారులను శాంతింపజేసే ప్రయత్నం చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నిరుద్యోగుల జంగ్ సైరన్..



### 20వేల పోలీస్ ఉద్యోగాల కోసం తెలంగాణ బంద్?!

**హైదరాబాద్, జూలై 06 :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లయినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన హామీని విస్మరించడంతో అగ్గిమీదగుగ్గిలం అవుతున్నారు. ఈ క్రమంలో తాజాగా హోమ్ శాఖలో 7,437 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో నిరుద్యోగులు మండిపడుతున్నారు. కనీసం 20వేల పోస్టులకు తగ్గకుండా నోటిఫికేషన్ ఇస్తారని ఎదురుచూస్తున్న వారికి చేదు వార్త తెలియడంతో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో రగిలిపోతున్నారు. 20 వేల పోస్టులతో మెగా నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బంద్‌కు సన్నద్ధమవుతున్నారు. ఉద్యోగ విరమణలు, కొత్త స్టేషన్ల ఏర్పాటు, మహిళా పోలీసుల సంఖ్య పెంపు, పెరుగుతున్న జనాభా, చట్ట వ్యవస్థ అవసరాల దృష్ట్యా ప్రస్తుతం ఉన్న ఖాళీలన్నింటినీ ఒకేసారి భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# మాట్లాడుకుందామంటూ పిలిచి దారుణ హత్య..

### బాలాపూర్‌లో కలకలం



**హైదరాబాద్, (సూర్యాపేట) జూలై 06 :** హైదరాబాద్‌లోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి జరిగిన హత్య తీవ్ర కలకలం రేపింది. మరియం కాలనీకి చెందిన ఫహద్ బల్కషర్ (28)పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటనగా ప్రారంభమైన కేసులో, జిమ్ పరిచయం నుంచి ఏర్పడిన పాత విభేదాలే హత్యకు కారణమైనట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.పోలీసుల వివరాల ప్రకారం, ఫహద్‌కు జిమ్‌లో పరిచయమైన సలాం బౌమ్, సయీద్ బౌమ్‌లతో కొంతకాలంగా విభేదాలు కొనసాగుతు న్నాయి. ఈ నేపథ్యంలో మాట్లాడుకుందామని నమ్మించి తెల్లవారుజామున పిలిచిన నిందితులు అతనిపై కిరాతకంగా దాడి చేసినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన ఫహద్‌ను వెంటనే ఒవైసీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

# ఐటీ పార్క్ నిర్మించాల్సిన చోట డంపింగ్ యార్డా?..

- జీవోను ఉపసంహరించాలి
- మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్



**హైదరాబాద్, జూలై 07 :** జిల్లాలోని కొత్తూరు మండలం సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటుపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు స్థానికులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. డంప్ యార్డు వల్ల ఏ విధంగా నష్టపోతున్నామో వివరిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి వ్యతిరేకంగా తమ పక్షాన పోరాడాలని, తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. సిద్దా పూర్ గ్రా మంలో 86 ఎకరాల్లో డంప్ యార్డు ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నం. 641 తీసుకురావడం అత్యంత దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. పచ్చని వ్యవ సాయ భూముల మధ్య, జనావాసాలకు సమీపంలో డంప్ యార్డు ఏర్పాటు చేయాలను కోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు నిదర్శనమని విమర్శించారు.సిద్దాపూర్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న దాదాపు 20 గ్రామాలు ఈ డంప్ యార్డు వల్ల తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గ్రామాల ప్రజలంతా పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి హైదరాబాద్ నగరానికి అవసరమైన కూరగాయలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని వెల్లడించారు. డంప్ యార్డు ఏర్పాటు చేయాలనుకుంటున్న స్థలానికి ఆనుకుని ఉన్న గుట్ట చెరువు నీటితోనే ఈ ప్రాంత రైతులు వ్యవసాయం చేసుకుంటు న్నారని, ఇక్కడ డంప్ యార్డు పెడితే ఆ నీరు పూర్తిగా కలుషితమై, సాగు నీటితో పాటు తాగునీటికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని అన్నారు. ఎంతో ప్రసిద్ధి చెందిన జహంగీర్ పీర్ దర్గా పరిసర ప్రాంత స్థానికులతో పాటు భక్తులకు కూడా శాపంగా మారడం ఖాయమని అన్నారు.గత బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఇదే ప్రాంతంలో, డంప్ యార్డుకు కేటాయించిన సర్వే నంబర్లు 252, 278, 361లో ఉన్న 334 ఎకరాల్లో ఐటీ పార్క్ నిర్మించాలని ప్రణాళికలు రూపొందించామని అన్నారు.ఇక్కడ ఐటీ పార్క్ వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని బీఆర్‌ఎస్ సంకల్పించిందని వివరించారు. ప్రభుత్వం వెంటనే సిద్దాపూర్ డంప్ యార్డు నిర్ణయాన్ని బేషరతుగా ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో బీఆర్‌ఎస్ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని, స్థానిక రైతులకుఅండగా నిలబడి పోరాడుతుందని హెచ్చరించారు.

# హమాలీ సోదరుల రుణం తప్పకుండా తీర్చుకుంటా

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, జూలై 07 :** హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లో జరిగిన 18వ హమాలీ యూనియన్ మహాసభకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర అధినేత, రాష్ట్రాన్ని నడిపే వ్యక్తి మంచి బుద్ధి కలిగిన రాష్ట్రంలో పేదలు కానీ, పెద్దలు కానీ సంతోషంగా ఉంటారు. రాష్ట్రంలో హమాలీలు కానీ లేదా మిల్లు యజమానులు కానీ సంతోషంగా ఉంటా రు. పదేళ్లు మనం కేసీఆర్ ప్రభుత్వంలో అదే చూసినం. రైతులు బాగున్నరు. పారిశ్రామిక వేత్తలు బాగున్నారు. కరెంట్ బాగుండే, పారిశ్రా మిక వేత్తలు బాగుండే, కార్మికులు బాగుండేనన్నా రు. అంతా సుభిక్షంగా ఉండే. కానీ కొంత ఏమరపాటు వల్ల మనం చేసిన కొన్ని పొరపాట్ల వల్ల మనం అధికారం కోల్పోయినమన్నారు.శీనన్న చెప్పినట్టు అధికారం పోతే పోయింది.. కానీ ప్రజల్లో మమకారం తగ్గలేదు. అధికారం పోతే పోయింది.. కానీ కొన్ని వాస్తవాలు ఇయ్యాళ్ల మనకు కూడా తెలుస్తున్నయి. కుండ పగిలితే పగిలింది కానీ కుక్క బుద్ధి తెలిసిందని... ఎవడు మనోడు ఎవడు పగోడు మనకు కూడా అర్థమవుతోంది. ఎవరైతే ఈ కష్టసమయంలో కూడా మనతో నిలబడి ఉన్నరో 18వ ఆవిర్భావ దినోత్సవం చేసుకుంటున్నం మేము.. మా గుండెల్లో కేసీఆర్‌ను పెట్టుకున్నం. మీరు రావాలే అని మమ్మల్ని పిలుచుకున్న మా హమాలీ సోదరులకు మీ రుణం తప్పకుండా తీర్చుకుంటానని కేటీఆర్ హమాలీలకు హామీనిచ్చారు. మీ ప్రతీ సమస్య పరిష్కారం చేసే బాధ్యత నేను తీసుకుంటా అని .. మీరు గట్టిగా ఉండండి.. మిమ్మల్ని చేయగలిగింది ఏమీ లేదు. మా మీద అంటే రెండు కేసులు పెడ్తరు. మీ మీద కూడా కేసులు పెడితే ఏమైతదో ఆయనకు కూడా తెలుసు. మిమ్మల్ని ఎవ్వడూ ఏమి చేయలేడు. ఐకమైత్యంగా, గట్టిగా ఉండండి.. ఇంకో రెండేళ్లలో తిరిగి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేసుకుందా. చిన్న చిన్న సమస్యలేమున్నా తప్పకుండా పరిష్కారం చేసుకుందామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు క్యామ మల్లేష్, హమాలీ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటా....



- తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ వెల్లడి....
- నూతన మండల అధ్యక్షులు కార్యకర్తలకు అండగా ఉంటారు.

**హైదరాబాద్, (సూర్యాపేట) జూలై 06 :** తుంగతుర్తి మండల పరిధిలోని శాసనసభ్యులు మందుల సామెల్ వసతి గృహంలో ఎమ్మెల్యే సామెల్ మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీనిఅభివృద్ధి చేసిన కార్యకర్తలు సీనియర్ నాయకులు అనే గ్రామాల నాయకులతో కార్యకర్తలతో కలిసిమెలిసి ఉండే వారికి నూతన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులను నియమించడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలోని ప్రతి పేదవానికి మన పార్టీ ఇస్తున్న పథకాలను తెలియపరుస్తూ వారిని చైతన్యం చేస్తూ కాంగ్రెస్ పార్టీ పేదవారికి కల్పిస్తున్న ఇందిరమ్మ ఇల్లు వారికి చెందే విధంగా ప్రతి గ్రామంలో పేదవారికి ఇచ్చే సౌకర్యాలను చేస్తూ ఇంకా గ్రామాలలో వారికి కావలసిన సేవలను అందిస్తూ అన్ని పథకాలు మన పార్టీ కార్యకర్తలకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గత కొన్ని సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీలో పని చేసిన ప్రతి నాయకుని కార్యకర్తను మీరు కలుపుకొని పనులు చేయాలని నూతన మండల అధ్యక్షులకు క్షుణ్ణంగా తెలిపారు. పార్టీ అధిష్టానం సలహాలు సూచనల మేరకు నేను ప్రతి మండలంలో నూతన మండల అధ్యక్షులను పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు ఇచ్చినాను నేను ఎలాంటి స్వార్థం కోసం చేయలేదని ఆయన నాయకులను కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. నేను ప్రతి మండలంలోని గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నానన్నారు. కొంత మంది నాపై పడని వారు మాయమాటలు చెబుతూ కొన్ని మండలాలలో నాకు వ్యతిరేకంగాప్రచారం చేస్తూ పార్టీని బ్రష్టు పట్టిస్తున్నారుఅని ఆయనఅన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రేగటి రవి గౌడ్, మార్కెట్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న,పిఏసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు, పలు మండలాల మండల అధ్యక్షులు సర్పంచులు మాజీ సర్పంచులు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణలో ప్రభుత్వం విఫలం :

- మాజీ మంత్రి పువ్వాడ



**ఖమ్మం జూలై 07 :** పారిశుద్ధ్య నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ఆ రోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే సమగ్ర ప్రణాళిక రూపొందించి పారిశుద్ధ్య సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు.వర్షాకాలం దృష్ట్యా ఖమ్మం జిల్లాను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. పారిశుద్ధ్యం లోపించడం అపరిశుభ్రత కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిచోటా చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో పేలిన రైస్ కుక్కర్..



- చిన్నారులకు గాయాలు

**నాగర్ కర్నూలు జూలై 07 :** నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ పట్టణం పదో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో రైస్ కుక్కర్ పేలి చిన్నారులకు గాయాలయ్యాయి. గాయపడ్డ చిన్నారులను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైస్ కుక్కర్‌లో వండిన తరువాత ఆయా దానిని చిన్నారుల ఎదుటే తీయడంతో ఒక్కసారిగా పేలింది. దీంతో అక్కడే ఉన్న చిన్నారులు గాయపడ్డారు.గాయపడ్డ చిన్నారులను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైస్ కుక్కర్‌లో వండిన తరువాత ఆయా దానిని చిన్నారుల ఎదుటే తీయడంతో ఒక్కసారిగా పేలింది. దీంతో అక్కడే ఉన్న చిన్నారులు గాయపడ్డారు.

# 300 కోట్ల అక్రమాస్తులు..

### డీఎస్పీ భీమ్‌రెడ్డి అరెస్ట్..!



**హైదరాబాద్, జూలై 07 :** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిన డీఎస్పీ భీమ్‌రెడ్డిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. రూ.300 కోట్ల అక్రమాస్తులు కేసులో సోమవారం ఏసీబీ బృందం భీమ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంది. 'డీఎస్పీ భీమ్‌రెడ్డి అరెస్టు ఎప్పుడో.. అరెస్టు కాకుండా అడ్డుకున్న 'అదృశ్య శక్తి' ఎవరు?' అని నమస్తే తెలంగాణలో కథనం ప్రచురించిన రెండు రోజులకే స్పందించిన ఏసీబీ అధికారులు ఎట్ట కేలకు ఆయనను అరెస్ట్ చేశారు.ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నా యనే ఆరోపణల నేపథ్యంలో డీఎస్పీ భీమ్‌రెడ్డిపే కేసు నమోదైంది. కేసు దర్యాప్తులో భాగంగా నాలుగు రోజుల క్రితం భీమ్‌రెడ్డికి చెందిన నివాసాలు, కార్యాలయాలు, ఇతర అనుబంధ ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.300 కోట్ల విలువైన ఆదాయానికి మించిన అక్రమాస్తులను గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది. సోదాల్లో లభించిన ఆధారాలు, పత్రాల పరిశీలన అనంతరం భీమ్‌రెడ్డిని అధికారులు అరెస్ట్ చేసిన ట్లు సమాచారం. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలను ఏసీబీ త్వరలో అధికా రికంగా వెల్లడించే అవకాశం ఉంది. రాష్ట్ర పోలీస్ శాఖలో భారీ తిమింగలంగా భావిస్తున్న డీఎస్పీ భీమ్‌రెడ్డిని ఏసీబీ చరిత్రలోనే అతిపెద్ద అవినీతి తిమింగలంగా భావిస్తున్నారు. తెలం గాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని16 ప్రాంతాల్లో ఈ దాడుల్లో రూ.200 కోట్ల నుంచి 300 కోట్ల విలువైన అక్రమాస్తులు వెలుగుచూశాయి.

(మొదటిపేజీ తరువాయి)

# రాజకీయకక్షతోనే కాళేశ్వరం ఎత్తిపోతల నిలుపుదల!

వరదల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన చర్యలన్నీ చేపట్టారు. గతేడాది 12 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చినా ఎక్కడా ఎలాంటి సమస్యా తలెత్తలేదు. బరాజ్ పూర్తిస్థాయి ఎఫ్ఆర్ఎల్ 100 మీటర్లు. 16.7 టీఎంసీలు నిల్వ ఉంటాయి. కానీ నదిలో ప్రవాహ మట్టం 93.5 మీటర్లకు చేరుకుంటే బరాజ్‌లో నీటిని నిల్వ చేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని పంపింగ్ చేసుకోవచ్చు. నదిలో ప్రవాహం 50వేల క్యూసెక్కులు దాటితే జలాలు స్వతహాగా కన్నెపల్లి పంప్‌హౌస్‌కు చేరుకునేలా నిర్మించారు. ప్రస్తుతం అక్కడ నీటిని పంపింగ్ చేసుకునేందుకు వీలుగా ప్రవాహాలు కొనసాగుతున్నాయి. గతంలో సుందిళ్ల బరాజ్‌లో రెండు చోట్ల, అన్నారం బరాజ్‌లో నాలుగు చోట్ల నీటి లీకేజీలు ఏర్పడ్డాయి. వాటి నివారణ చర్యల బాధ్యతను అధికారులు డైనోసర్ అనే కంపెనీకి అప్పగించారు. ఆ కంపెనీ సుందిళ్లలో రెండు చోట్ల ఏర్పడిన లీకేజీలను విజయవంతంగా అరికట్టింది. గ్రౌటింగ్ పూర్తి చేసింది. అన్నారంలోకూడా పూర్తి చేసింది. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు గ్రౌటింగ్ చేశామని, సీసీ బ్లాకులను పునరుద్ధరించామని, టెస్టులు పూర్తి చేశామని, రిపోర్టులను సమర్పించామని, బరాజ్ నిర్మాణ ఏజెన్సీ అఫ్కాన్స్ సైతం గతంలోనే కాళేశ్వరం కమిషన్ ఎదుట నివేదించింది. బరాజ్‌లో క్రాక్స్ ఏమైనా వచ్చాయో లేదో చెక్ చేసేందుకు డ్రోన్ సర్వే చేశామని, ఎక్కడా ఒక క్రాక్ కూడా పడలేదని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సుందిళ్ల, అన్నారం బరాజ్‌లను వినియోగించుకోవచ్చని నీటిపారుదల శాఖ వర్గాలు సైతం ఘంటాపథంగా చెప్తున్నాయి. అదీగాక అన్నారం బరాజ్ ఎఫ్ఆర్ఎల్ 119మీటర్లుకాగా, పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 10టీఎంసీలు. కానీ బరాజ్‌లో 116.5మీటర్ల వరకు నీటిమట్టాన్ని మెయింటెయిన్ చేస్తే చాలు, అక్కడి నుంచి నీటిని లిఫ్ట్ చేసుకోవచ్చు.అంటే కేవలం 3 నుంచి 4 టీఎంసీలు నిల్వ చేస్తే చాలు. సుందిళ్ల బరాజ్ ఎఫ్ఆర్ఎల్ 130 మీటర్లు కాగా, పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 8.85 టీఎంసీలు. కానీ బరాజ్‌లో 126మీటర్ల లెవల్ వరకు నీటిని మెయింటెయిన్ చేస్తే నీటిని పంప్‌హౌస్ నుంచి ఎత్తి ఎల్లంపల్లికి తరలించుకోవచ్చు. ఆ లెవల్‌లో బరాజ్‌లో 3 టీఎంసీలకు మించి జలాలు ఉండవని అధికారులు చెప్తున్నారు. అంటే మొత్తంగా రెండు బరాజ్‌లో 7టీఎంసీల వరకు జలాలు మించవు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం రెండు బరాజ్‌లు కూలిపోతాయని అసత్య ప్రచారం చేస్తున్నది. వాస్తవంగా ఈ రెండు బరాజ్‌లలో మేడిగడ్డ తరహాలో మేజర్ సమస్యలేవీ లేవు. కాబట్టి బరాజ్‌లో నీటినిల్వ చేస్తేనే ఇతర సాంకేతిక సమస్యలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఒకవేళ చిన్నపాటి సమస్యలను గుర్తిస్తే, వెంటనే సవరించుకుని వినియోగించుకునే వీలుంటుందని తెలిపారు. అయినా రెండున్నరేండ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పనిచేయలేదు.అంతేకాదు 2025 మార్చిలో నిర్వహించిన శాసనమండలి సమావేశాల్లో పలువురు సభ్యులు ఇదే అంశంపై ప్రశ్నలు లేవనెత్తారు. 'మేడిగడ్డ బరాజ్ మాదిరిగా సుందిళ్ల , అన్నారం బరాజ్‌లు కూలిపోతాయని నిపుణులు అభిప్రాయ పడిన విషయం వాస్తవమేనా?' అని అడిగారు. దానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ 'ఆ బరాజ్‌లు సేఫ్' అని ఘంటాపథంగా చెప్పారు.

## మక్కలు అమ్మిన రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో గల్లంతు!

సొసైటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో 362 క్వింటాళ్ల మక్కజొన్నలు అమ్మారు. పంటను యాదాద్రి భువనగిరి జిల్లా టేకులసోమవరం గిడ్డంగిలో దిగుమతి చేశారు. ఈ మేరకు మార్క్‌ఫెడ్, తిరుమలాయపాలెం సొసైటీ అధికారులు రైతులకు రసీదుతోపాటు ట్రక్ షీట్ కూడా ఇచ్చారు. నెలలు గడుస్తున్నా మక్కజొన్నల డబ్బులు తమ బ్యాంక్ ఖాతాలో పడకపోవడంతో బాధిత రైతులు బీఆర్ఎస్ మండల నాయకులతో ఖమ్మం మార్కెట్ కార్యాలయానికి వెళ్లారు. డబ్బులు అకౌంట్లో జమకాని విషయమై వివరణ కోరారు. ఈ విషయమై మార్క్‌ఫెడ్ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ కల్యాణ్‌కుమార్ పరిశీలించి 'మీ పేర్లు అసలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. మీరు మక్కజొన్నలు అమ్మారా? లేదా ఎవరికి తెల్సు' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడినట్టు రైతులు వాపోయారు. ఈ విషయమై ఫోన్‌లో మార్క్‌ఫెడ్ డీఎంకు ఫిర్యాదు చేశారు.

## జిల్లాల్లో డ్రగ్స్ నియంత్రణ రాష్టానికి అత్యంత కీలకం..!

పనిచేస్తుందని పేర్కొన్న ఆయన.. డ్రగ్స్‌తో సంబంధం ఉన్న వారిని అరెస్ట్ చేసేందుకు ఈ మధ్యలో థాయిలాండ్ వెళ్లేం దుకు కూడా ఈగిల్ బృందానికి అనుమతి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. గంజాయి, డ్రగ్స్ కట్టడి కోసం బస్ స్టాండ్లు, చెక్‌పోస్టులు, రైల్వే స్టేషన్లలో డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు ముమ్మరం చేయాలని డీజీపీ తెలిపారు. అలానే సైబర్ నేరాలు, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల పనితీరు అభినందనీ యమని పేర్కొన్న డీజీపీ.. నేరాల నియంత్రణలో ఇదే నిబద్ధతతో ముందుకు సాగాలని జిల్లా పోలీసులకు సూచనలు చేశారు.

## రేవంత్ సర్కార్ రికార్డు

రూపాయలు పంపిణీ చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు తక్కువ కాలంలోనే 23,070 కోట్ల రూపాయలను లబ్ధిదారులకు విడుదల చేసింది. అత్యధికంగా నల్గొండ జిల్లాకు 5,491 కోట్లు గరిష్ట నిధులు ఇందులో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద 9 లక్షల మంది నిరుపేద వ్యవసాయ కూలీలను సైతం చేర్చి వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు కూడా లబ్ధి చేకూరుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం పైన ఈ పథకానికి సంబంధించిన ఆర్థిక భారం పెరిగినప్పటికీ రైతు సంక్షేమం కోసం ఈ చర్య తీసుకున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా నల్గొండ జిల్లాకు 5, 491 కోట్లు గరిష్ట నిధులు అందాయి. బోగస్ లబ్ధిదారుల ఏరివేత కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న కాంగ్రెస్ సర్కార్ ఆ తర్వాత స్థానాలలో సంగారెడ్డి, ఖమ్మం, నాగర్ కర్నూల్ జిల్లాలు నిలిచాయి. అత్యల్పంగా వ్యవసాయ భూములు లేని హైదరాబాద్ చివరి స్థానంలో ఉంది. ఇదిలా ఉంటే ఈ పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేయడం కోసం బోగస్ లబ్ధిదారుల ఏరివేత కార్యక్రమాన్ని అధికారులు వివరించారు. సాగులో లేని భూములను ఈ జాబితా నుండి తొలగిస్తున్నారు. ఇక ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి రైతు భరోసా నిధులు విడుదల కాగా, విడతలవారీగా ఇవి రైతుల ఖాతాలలో జమ కానున్నాయి.

## పర్యాటక ప్రాంతంగా దుర్గం చెరువు

సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో భాగ్యనగరంలో ఎకో పార్కులను తీర్చిదిద్దాలని ఆదేశించారు. హైదరాబాద్ కేంద్రంగా టూరిజం కాగా, క్యూర్ పరిధిలోని అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలన్నారు. అర్బన్ ఫారెస్ట్ తరహాలో ఏర్పాట్లు చేయాలని, ఆ ప్రాజెక్టుల కోసం ప్రత్యేక అధికారిని నియమించి పనులను ముమ్మరం చేయాలన్నారు. పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జిలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని, బ్రిడ్జిలపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవకాశం ఉంటే ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలన్నారు ముఖ్యమంత్రి. డిసెంబరులో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌పైనా కసరత్తు ప్రారంభించాలని, సమ్మిట్ కోసం శాఖల మధ్య సమన్వయం కోసం కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు.

## బండి సంజయ్‌కు కీలక బాధ్యతలు



పార్టీ బాధ్యతలు అప్పగించనున్నారు. ఇక.. సీనియర్ల శాఖల్లోనూ మార్పులు జరగనున్నాయి. మిత్రపక్షాలతో పాటుగా అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కనుంది. ఇక, తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ లో ప్రస్తుతం ఒక క్యాబినెట్, ఒక సహాయ మంత్రి పదవులు ఉండగా, రాబోయే ఎన్నికల వ్యూహంలో భాగంగా మూడో వ్యక్తికి అవకాశం కల్పించడం ద్వారా సామాజిక సమతుల్యత ను సాధించాలని అధిష్ఠానం యోచిస్తోంది. తెలంగాణ నుంచి మార్పులు – చేర్పులు మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకునేందుకు పలువురు సీనియర్ నాయకులు ఎవరి ధీమాతో వారు ఉన్నారు. ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అర్వింద్, నగేశ్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ఇద్దరు మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ విషయంలోనూ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కిషన్ రెడ్డికి శాఖ మార్పు ఉంటుందని ప్రచారం జరుగుతోంది. బండి సంజయ్‌ను మంత్రిగా కొనసాగిస్తూ.. పార్టీలో నితిన్ నబీన్ టీంలోకి తీసుకొస్తారనే వాదన వినిపిస్తోంది. కాగా, కిషన్ రెడ్డికి పార్టీ బాధ్యతలు అప్పగిస్తే సామాజిక సమీకరణాల్లో భాగంగా డీకే అరుణకు ఛాన్స్ దక్కే అవకాశం కనిపిస్తోంది. కాగా.. ఇప్పటికే ఓసీ, బీసీ వర్గాలకు కేంద్రంలో చోటు దక్కినందున, గిరిజన ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు ఆదిలాబాద్ ఎంపీ నగేశ్‌కు అవకాశం ఇస్తారని పార్టీ ముఖ్య నేతల్లో ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ ఎస్టీ వర్గాన్ని తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాలు చేస్తుండటంతో.. అదే వర్గానికి తెలంగాణ నుంచి అవకాశం కల్పిస్తారని ఢిల్లీ నేతల సమాచారం. అదే విధంగా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ పేరు ప్రచారంలో ఉంది. ఇక.. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సైతం తనదైన శైలిలో గట్టి నమ్మకంతో ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీంతో, తెలంగాణ కేంద్రంగా మోదీ నిర్ణయాల పైన పార్టీలో ఆసక్తి నెలకొంది.

# గురుకులంలో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం

- భూమి పూజ చేసిన శాసనసభ్యులు మందుల సామెల్..



హైదరాబాద్, (సూర్యాపేట) జూలై 06 : తుంగతుర్తి మండల పరిధిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఈరోజు ఆర్టికల్ 275/1 గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ నిధులతో నిర్మించు అదనపు వసతిగృహం టాయిలెట్స్ బ్లాక్ మరియు వంటగది కం డైనింగ్ హాల్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని భూమి పూజ చేసిన శాసనసభ్యులు మందుల సామెల్ మాట్లాడుతూ. తెలంగాణ గురుకుల పాఠశాలలో నాలుగు కోట్ల రూపాయల నిధులను వెచ్చించి గురుకుల విద్యార్థులకు బాత్రూంలో భోజన వసతులకు పెద్ద హాలు పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులను వెచ్చించడం జరిగిందన్నారు. అదేవిధంగా గురుకులంలో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. విద్యార్థులకు నూతన వరవడితో విద్య బోధన చేస్తూ మంచి మార్కులు విద్యార్థులకు వచ్చే విధంగా మంచి ఉపాధ్యాయులు బోధించడంతో వారికి జిల్లాలోనే ర్యాంకులు రావాలని కోరడం జరిగింది. జిల్లా ఆర్ సి ఓ ఇన్చార్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు పాఠశాలకు సమయం పాటించి క్లాసులకు వచ్చి పిల్లలకు మంచి చదువులను నేర్పే విధంగా మీరు పిల్లలతో మమేకమైనప్పుడు మంచి ఫలితాలు వస్తాయని ఆయన పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులను కోరడం జరిగింది. మన గురుకుల తుంగతుర్తి నియోజకవర్గంలో 10వ తరగతి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు రాష్ట్రంలో మంచి మార్కులు వచ్చిన వారికి 50 వేల రూపాయలు బహుమతి ఇస్తానని ప్రకటించారు. అదేవిధంగా గురుకుల పాఠశాలలో కావాల్సిన వసతులను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు మాకు తెలియపరిస్తే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. గురుకులంలో ఖాళీగా ఉన్న పోస్టులను తొందర్లోనే భర్తీ చేస్తామని తెలిపారు. విద్యార్థులు ఈసారి ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎస్టీ వారిని ఇంకా చేర్పించుకుంటామని తెలిపారు. ఇప్పటికీ పాఠశాలలో 580 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వారికి అన్ని వసతులతో పాటు కాస్మోటిక్ వస్తువులను కూడా పంపిణీ చేయడం జరిగింది అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి విద్యా శాఖ మంత్రి ఉండటం చాలా గర్వకారణం అన్నారు. వారు చేసే కృషితో మన రాష్ట్రంలో విద్య వైద్య సౌకర్యాలకు అధిక నిధులను వెచ్చిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ చింతగండ్ల వెంకన్న, పిఏసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు, పలు మండలాల మండల అధ్యక్షులు తిరుమలగిరి సుంకర్ జనార్ధన్,,నాగారం కన్నబోయిన వెంకట భిక్షం యాదవ్, తుంగతుర్తి రేగటి రవి గౌడ్, జాజిరెడ్డిగూడెం గుడిపల్లి మధుకర్ రెడ్డి,మద్దిరాల పచ్చిపాల వెంకన్న యాదవ్, నూతనకల్ కట్ట మల్లారెడ్డి పలు మండలాల గ్రామ శాఖ అధ్యక్షులు సర్పంచులు మాజీ సర్పంచులు ఎన్ఎస్ఈఐ యువజన నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తొర్రూరు జంక్షన్‌కు మహర్దశ

- రూ.335 కోట్ల వ్యయంతో రోడ్డు విస్తరణ పనులు..
- నేడు తొర్రూరులో మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు శంకుస్థాపన....



హైదరాబాద్, జూలై 06 : దాదాపు రూ.338 కోట్లతో వ్యయంతో ఎల్బీనగర్––ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో నాలుగు లైన్ల రహదారుల నిర్మాణానికి మంగళవారం శంకు స్థాపన జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.338 కోట్ల వ్యయంతో హ్యామ్ విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లైన్ల రహ దారుల నిర్మాణ పనులకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేయనున్నారు. తొర్రూరు గ్రామంలో మంగళవారం ఉదయం 10 గంటల 30 నిమిషాలకు శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. ఇబ్రహీంపట్నం నియోజక వర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన ఈ శంకు స్థాపన కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథు లుగా భువనగిరి పార్లమెం ట్ సభ్యులు చామలకిరణ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ ప్రతిష్టాత్మక రహదారి ప్రాజెక్టుల ద్వారా ఇబ్రహీంపట్నం ఎల్బీనగర్ నియోజక వర్గాల పరిధిలోని తుర్కయా ంజాల్, తొ ర్రూర్, పెద్ద అంబర్పేట్, కుంట్లూరు, హయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్ సదుపా యాలతో కూడిన ఆధునిక ఫోర్ లైన్ రహదారులు నిర్మించబడనున్నాయి. ఈప్రాజెక్టుద్వారాప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన, నాణ్యమైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు ట్రాఫిక్ రద్దీ తగ్గి,ప్రాంతీయఅభివృద్ధికికొత్త ఊపు లభించనుంది.

శంకుస్థాపన చేయనున్న రహదారి పనులు

హయత్‌నగర్–తొర్రూరు–కోహెడ–అనాజ్‌పూర్ వరకు

అనాజ్‌పూర్–అబ్దుల్లాపూర్‌మెట్–బండరావిర్యాల వరకు

హయత్‌నగర్–కుంట్లూరు–పసుమాముల–తారామతిపేట వరకు

సాగర్‌రోడ్డు–ఇంజాపూర్–తొర్రూరు–బ్రాహ్మణపల్లి–రాగన్నగూడ వరకు

సాగర్‌రోడ్డు–ఇంజాపూర్–హయత్‌నగర్ వరకు

ప్రజా ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల అభి వృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, గ్రామీణ–పట్టణప్రాంతాలను అనుసంధానించే రహదారులను ఆధునికీకరించే దిశగా ప్రభు త్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ రూ.338 కోట్ల రహదారి ప్రాజెక్టు ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం ప్రా ంతాల భవిష్యత్‌అభివృద్ధికిమైలురాయిగా నిలవనుంది.

## పహల్గామ్ ఉగ్రదాడికి హాఫీజ్ సయీదే కీలక సూత్రధారి.. ఛార్జీషీట్‌లో ఎన్ఐఏ



హైదరాబాద్ : పహల్గామ్ ఉగ్రదాడికి సంబంధించిన దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనలో లష్కరే తయ్యిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌ను కీలక సూత్రధారిగా పేర్కొంటూ జాతీయ దర్యాప్తు సంస్థ (చీ×ూూ) సోమవారం అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ దాడికి ఉగ్రవాదులను ఆదేశించడం దగ్గరి నుంచి కుట్రకు ప్రణాళిక రూపొం దించడం, దాన్ని అమలు చేసేలా సయీద్ ఎప్పటికప్పుడు సమీక్షించినట్లు ఆధారాలున్నాయని ఎన్ఐఏ పేర్కొంది.పహల్గాం ఉగ్రదాడి కేసులో ఇప్పటికే 1597 పేజీల ఛార్జిషీట్‌ను ఎన్ఐఏ కోర్టుకు సమర్పించింది. దీనికి అనుబంధంగా నేడు మరోసారి అభియోగపత్రాలను దాఖలు చేసింది. ఇందులో సీమాంతర ఉగ్రవాదం, హాఫీజ్ సయీద్ పాత్ర, ఉగ్రవాదులకు పాకిస్థాన్ అండ వంటి అంశాలను పొందుపర్చింది. గత ఏడాది డిసెంబర్ 15న దాఖలైన తొలి ఛార్జిషీట్‌లో పాకిస్థానీ హ్యాండ్లర్ సాజిద్‌తో పాటు, 2025 జూలైలో జరిగిన ఆపరేషన్ మహాదేవ్‌లో భద్రతా బలగాలు హతమార్చిన ముగ్గురు ఉగ్రవాదులు, అరెస్టయిన ఇద్దరు నిందితుల గురించి ఎన్ఐఏ పేర్కొంది. దాడిలో లష్కరే తయ్యిబా, దాని అనుబంధ సంస్థ అయిన టీఆర్ఎఫ్ సంస్థల పాత్ర గురించి అభియోగపత్రంలో చేర్చింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22, 2025న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

## మణిపూర్‌లో మిలిటెంట్ల మెరుపుదాడి..



### ఇద్దరు అస్సాం రైఫిల్స్ జవాన్లు మృతి

ఇంఫాల్: జవాన్ల కాన్వాయ్‌పై మిలిటెంట్లు మెరుపుదాడి చేశారు. ఈ సంఘటనలో ఇద్దరు అస్సాం రైఫిల్స్ జవాన్లు మరణిం చారు. మరికొందరు గాయపడ్డారు. మణిపూర్‌లోని ఉఖ్రుల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో నుంగ్‌షాంగ్ ఖోంగ్ ప్రాంతంలో 40 అస్సాం రైఫిల్స్‌కు చెందిన కాన్వాయ్‌పై మిలిటెంట్లు కాల్పులు జరిపారు. ఈ సంఘటనలో ఇద్దరు అస్సాం రైఫిల్స్ జవాన్లు మరణించారు. మరికొందరు జవాన్లు గాయపడ్డారు. వెంటనే ఆ ప్రాంతానికి అదనపు బలగాలను తరలించారు. దాడి చేసిన అనుమానిత మిలిటెంట్ల కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు.కాగా, ఉఖ్రుల్ జిల్లాలోని లంబూయి గ్రామంలో మోహరించిన సుమారు 40 మంది అస్సాం రైఫిల్స్ సిబ్బంది న్యూ హెవెన్‌లో ఒక అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నించారు. అయితే స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపకుండా అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహించారు. ఆదివారం మహిళలు, విద్యార్థి సంఘాలతో సహా స్థానికులు నిరసన తెలిపారు. అవుట్‌పోస్ట్ నిర్మాణ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.మరోవైపు నిరసన చేస్తున్న జన సమూహాన్ని నియంత్రించేందుకు అస్సాం రైఫిల్స్ సిబ్బంది లాఠీచార్జ్‌తో పాటు పలు రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ సందర్భంగా నలుగురు గ్రామస్తులు గాయపడ్డారు. ఈ సంఘటన తర్వాత మిలిమెంట్లు మెరుపుదాడి చేయడంతో ఇద్దరు అస్సాం రైఫిల్స్ జవాన్లు మరణించగా పలువురు గాయపడ్డారు.

## వ్యాయామశాలల అభివృద్ధికి, రెజ్లర్లకు సంపూర్ణ సహకారాలు అందిస్తా



### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, జూలై 06 : తన జీవితకాలం పాటు జాతీయ, అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీలకు హాజరయ్యే రెజ్లర్లకు అవసరమైన సహకారాన్ని అందిస్తానని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నగరంలోని వ్యాయామశాలల నిర్వాహకులు, రెజ్లర్లతో తలసాని సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. వ్యాయామశాలల అభివృద్ధికి, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన రెజ్లర్లకు తన సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.పోటీలకు హాజరయ్యే రెజ్లర్ల వెంట వెళ్లే కోచ్‌లకు కూడా అవసరమైన సహకారాన్ని అందిస్తానని తెలిపారు. తాను ఏ ప్రయోజనాలను ఆశించి ఇంత పెద్ద సహకారం అందించడం లేదని, తనకు రెజ్లింగ్‌పై ఉన్న అభిమానంతో చేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఈ నెల 24వ తేదీన అదేరోజు తెలంగాణ భవన్‌లో మోడల్ రెజ్లింగ్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, పలువురు వ్యాయామశాలల నిర్వాహకులు, రెజ్లర్లు పాల్గొన్నారు.

## ఓఆర్ఆర్‌పై ఆగివున్న లారీని ఢీకొట్టిన కారు..

- ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు



హైదరాబాద్, జూలై 06 : హైదరాబాద్ శంషాబాద్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారుజామున ఓఆర్ఆర్ మీద ఆగివున్న లారీని ఓ కారు వెనుక నుంచి ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఒక మహిళ, చిన్నారి ఉన్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అసెంబ్లీ కమిటీల ఏర్పాటు..

### ఎస్సీ సంక్షేమం కమిటీ చైర్మన్‌గా మేడిపల్లి సత్యం..!

హైదరాబాద్, జూలై 06 : రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ కమిటీ లను ఏర్పాటు చేసింది. సెలెక్ట్ కమిటీ చైర్మన్‌గా రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహరించనున్నారు. తెలంగాణ విద్వేష ప్రసంగాలు, విద్వేష నేరాలను పరిశీలించే ఈ కమిటీలో 13 మంది సభ్యులు ఉండనున్నారు. జాయింట్ కమిటీకి కడియం శ్రీహరి ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. 11 మంది సభ్యులు, ఛైర్మన్‌తో జాయింట్ కమిటీ పనిచేయనుంది.అమినిటీస్ కమిటీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నేతృత్వం వహించనున్నారు. అమినిటీస్ కమిటీలో 11 మంది సభ్యులు ఉంటారు. ఎస్సీ సంక్షేమం కమిటీ ఛైర్మన్‌గా మేడిపల్లి సత్యంను ఎంపిక చేశారు. 11 మందితో కూడిన సభ్యుల బృందం ఈ కమిటీ విధుల్లో పాలుపంచుకోనుంది.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి




- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సుదర్శన్ రెడ్డి
- రాజన్న సిరిసిల్లలో 99.3 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి: కలెక్టర్ గరిమ అగర్వాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్‌వోలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్‌వోలు)తో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ పాల్గొన్నారు.

**ఈ నెల 20 నాటికి డిజిటలైజేషన్ పూర్తి చేయాలి**

ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 25 నుంచి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ తుది దశకు చేరుకుందని, పంపిణీ చేసిన ఫారాలను తిరిగి సేకరించి బీఎల్‌వో యాప్‌లో డిజిటలైజేషన్ చేపట్టాలని సూచించారు.

వాలంటీర్ల సహకారంతో ఓటర్లకు ఫారాల నింపడంలో సహాయం అందించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఈ నెల 20వ తేదీలోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. తప్పుడు సమాచారం సమర్పించిన ఓటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**జిల్లాలో 99.3 శాతం ఫారాల పంపిణీ పూర్తి**

భారత ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ తెలిపారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 99.3 శాతం పూర్తయిందని వెల్లడించారు. బీఎల్‌వోలకు ఇప్పటికే శిక్షణ అందించామని, ఫారాల డిజిటలైజేషన్‌ను కూడా గడువులోగా పూర్తి చేస్తామని చెప్పారు. ఓటర్లకు సౌకర్యంగా ఉండేందుకు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితారెడ్డి, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సిరిసిల్లలో నేడు మినీ జాబ్ మేళా.. నిరుద్యోగ యువతకు అవకాశం

**జూలై 8న ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నిర్వహణ**

**శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఉద్యోగాల భర్తీలిలి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జూలై 8న మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి నిర్మల తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. ప్రముఖ సంస్థ లిలిశ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లిలిలో ఉద్యోగాల భర్తీ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

**డిగ్రీ అర్హత.. రూ.16 వేల నుంచి రూ.40 వేల వరకు వేతనం**

ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.16 వేల నుంచి రూ.40 వేల వరకు వేతనంతో పాటు టీఏ, డీఏ సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

**అవసరమైన పత్రాలతో హాజరు కావాలి**

అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో జూలై 8న ఉదయం 11 గంటలకు సిరిసిల్ల ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నిర్వహించే మినీ జాబ్ మేళాకు హాజరుకావాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి నిర్మల కోరారు. మరిన్ని వివరాల కోసం 9010312496 , 7382794374 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# జైలు నుంచి పరారైన నిందితుడు ఆత్మహత్యాయత్నం

**బలగం టీవీ, మహబూబ్‌నగర్**



మహబూబ్‌నగర్ జిల్లా జైలు నుంచి పరారైన నిందితుడు కిషోర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జైలు నుంచి తప్పించుకున్న అనంతరం తన స్వగ్రామమైన వనపర్తి జిల్లా అమరచింత మండలం నందిమల్ల గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. వెంటనే అతడిని అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉందని, 24 గంటల పాటు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మైనర్ బాలికను ప్రేమించి వివాహం చేసుకున్నాడన్న ఆరోపణలపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. సోమవారం ఉదయం తువాళ్ల సహాయంతో జైలు గోడ దాటి పరారైన కిషోర్‌రెడ్డి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా, అనంతరం అతడిని గుర్తించారు. నిందితుడు లభించడంతో జిల్లా జైలు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు వెంటనే ప్రారంభించాలి




- బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగన్న
- మిడ్ మానేరు, మల్కపేట రిజర్వాయర్లకు నీటి విడుదల చేయాలని డిమాండ్
- వారం రోజుల్లో చర్యలు తీసుకోకపోతే రైతులతో కలిసి ఆందోళన హెచ్చరిక

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లను వెంటనే ప్రారంభించి, మిడ్ మానేరు (శ్రీ రాజరాజేశ్వర ప్రాజెక్టు), మల్కపేట రిజర్వాయర్లను నీటితో నింపాలని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగన్న డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ఇటీవల కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి వారం రోజుల్లో మోటార్లు ప్రారంభించి నీటి విడుదల చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల తరపున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

**రైతుల ప్రయోజనాలే బీఆర్ఎస్ లక్ష్యం**

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా ద్వారా రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందని తోట ఆగన్న పేర్కొన్నారు. జిల్లాలోని సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని వెంటనే నీటి విడుదల చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సమస్యలపై దృష్టి సారించి, రాజకీయ విమర్శలకు బదులుగా సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తోట ఆగన్న అన్నారు. మిడ్ మానేరు, మల్కపేట రిజర్వాయర్లను వెంటనే నింపాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ అరుణ రాఘవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు బాలు, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, సర్పంచ్ ఎలగందుల నరసింహులు, చిరంజీవి, రాజశేఖర్, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు గజ్‌బింకర్ రాజన్న, పూర్ణచందర్, సత్యనారాయణ రెడ్డి, జక్కుల రవీందర్, మాట్ల మధు అరుణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో రైస్ కుక్కర్ పేలి చిన్నారులకు గాయాలు

**బలగం టీవీ, నాగర్‌కర్నూలు**

నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని 10వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో రైస్ కుక్కర్ పేలడంతో పలువురు చిన్నారులు గాయపడ్డారు. ఘటనతో కేంద్రంలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి.

సమాచారం ప్రకారం, రైస్ కుక్కర్‌లో అన్నం వండిన అనంతరం ఆయా చిన్నారుల సమక్షంలో కుక్కర్ మూతను తీయగా, అది ఒక్కసారిగా పేలింది. ఈ ఘటనలో సమీపంలో ఉన్న చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన చిన్నారులను వెంటనే కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ యాదగిరి బిల్లా చికిత్స అందించారు. ప్రస్తుతం చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న సీడీపీవో మహేశ్వరి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆయాపై తగిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. వార్డు కౌన్సిలర్ బోరెల్లి మహేష్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి గాయపడిన చిన్నారులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.




# డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీకి బీజేపీ నేతల నివాళి

**జిల్లా కేంద్రంలో జయంతి కార్యక్రమం నిర్వహణలిలి**

**దేశ సమైక్యత కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం: రెడ్డబోయిన గోపి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, లిలి"ఏక్ దేశ్ మే దో నిశాన్, దో ప్రధాన్, దో విధాన్ నహీ చలేగా"లిలి అనే నినాదంతో దేశ సమైక్యత కోసం పోరాడిన మహానేత డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు కోసం ఆయన చేసిన ఉద్యమం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ ఎర్రం వెంకటరాజన్, పట్టణ ప్రధాన కార్యదర్శులు, మున్సిపల్ కౌన్సిలర్లు కొండ నరేష్, మెరుగు శ్రీనివాస్, ఉరవగొండ రాజు, మామిడాల మహేష్, పట్టణ ఉపాధ్యక్షుడు మోర శ్రీహరి, అధికార ప్రతినిధి మోర రవి, పట్టణ కార్యదర్శులు సూరం వినయ్, దూడం సురేష్, గాలి శ్రీనివాస్, కనుకయ్య, సిద్ది దేవరాజు, గొట్టే భాను తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం. సాయిబాబు**

**రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఉద్యమ కార్యాచరణపై చర్చ**

**బలగం టీవీ, హైదరాబాద్**

పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న నిర్వహించనున్న లిలి'జైల్ భరో'లిలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం. సాయిబాబు పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

**ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న కేంద్రం**

కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని ఎం. సాయిబాబు ఆరోపించారు. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ శక్తుల చేతుల్లో కేంద్రీకరించడం, ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచడం, కార్మిక హక్కులను కుదించడం, ప్రజలపై పన్నులు, ధరల భారం మోపడం వంటి చర్యలు కొనసాగుతున్నాయని విమర్శించారు. దశాబ్దాల పోరాటాల ఫలితంగా వచ్చిన కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్స్ అమలు చేయడం ద్వారా కార్మికుల హక్కులను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. విద్యుత్ సవరణల పేరుతో విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలహీనపరుస్తూ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ చర్యలను ప్రమాదంలోకి నెడుతున్నారని ఆరోపించారు.

**ఉపాధి హామీ, రైతు సమస్యలపై ఆందోళన**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మార్పులతో గ్రామీణ కార్మికుల ఉపాధి దెబ్బతింటోందని, రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.

**ఆగస్టు 10 ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని పిలుపు**

సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూ సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపడుతున్నాయని తెలిపారు. జూలై 29న ఢిల్లీలో జరిగే జాతీయ సదస్సు, ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌తో పాటు రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

# రూ.70 వేల లంచం తీసుకుంటూ చేర్యాల ఏసీబీకి చిక్కిన తహసీల్దార్



**బలగం టీవీ, సిద్దిపేట**

సిద్దిపేట జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు చేపట్టిన దాడిలో చేర్యాల తహసీల్దార్ కొర్రా దిలీప్ నాయక్ రూ.70 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. సోమవారం తన కార్యాలయంలోనే లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు.

ఏసీబీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, నాగపురి గ్రామంలోని పలు సర్వే నంబర్లకు సంబంధించిన 11–నాలా (వ్యవసాయేతర భూమి మార్పిడి) దరఖాస్తుల ప్రాసెసింగ్ కోసం ఫిర్యాదుదారుడి నుంచి తహసీల్దార్ రూ.70 వేల లంచం డిమాండ్ చేసినట్లు తెలిపారు. జమున కనకమ్మ తదితరుల పేర్లపై ఉన్న 30 గుంటల భూమికి సంబంధించిన పనులు పూర్తి చేయడానికి ఈ మొత్తాన్ని స్వీకరిస్తుండగా అధికారులు వల పన్ని పట్టుకున్నారు. దిలీప్ నాయక్ వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు ఆయనను అరెస్ట్ చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు లేదా ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ లిలి1064లిలికు సమాచారం అందించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అన్ని అర్హులైన గృహాలకు 20 వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకం విస్తరించాలి

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ ఎం. శ్రీనివాస్ వినతి**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రస్తుతం ప్రభుత్వం జీహెచ్ఎంసీ పరిధిలో అమలు చేస్తున్న నెలకు 20 వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకాన్ని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలోని అన్ని అర్హులైన గృహాలకు విస్తరించాలని అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ ఎం. శ్రీనివాస్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించిన ఆయన, జీహెచ్ఎంసీ పరిధిలో అమలవుతున్న ఈ సంక్షేమ పథకం ప్రజలకు ఎంతో ఉపశమనం కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం జీహెచ్ఎంసీ పరిపాలనా పరిధిని ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించిన అనంతరం జలమండలి సేవలను కూడా అదే మేరకు విస్తరించినప్పటికీ, ఉచిత తాగునీటి పథకం మాత్రం కొత్తగా చేరిన ప్రాంతాలకు వర్తింపజేయలేదని తెలిపారు.

గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలో నివసిస్తున్న ప్రజలు కూడా ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తూ, జలమండలి సేవలను వినియోగిస్తున్నప్పటికీ ఈ పథకం ప్రయోజనం అందకపోవడం సముచితం కాదన్నారు. సమానత్వ సూత్రానికి అనుగుణంగా అన్ని అర్హులైన కుటుంబాలకు ఒకే విధంగా సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. ఔటర్ రింగ్ రోడ్ వరకు ఉన్న ప్రాంతాలకు కూడా నెలకు 20 వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకాన్ని విస్తరించి, గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలోని అన్ని అర్హులైన గృహాలకు వర్తింపజేయాలని ముఖ్యమంత్రిని ఎం. శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# యాజమాన్య పద్ధతులతో మామిడి సాగులో అధిక దిగుబడులు సాధించాలి

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**బలగం టీవీ, జగిత్యాల**

శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటిస్తే మామిడి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం ఇబ్రహీంనగర్ గ్రామంలో సోమవారం జిల్లా మామిడి రైతుల కోసం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు వరి సాగుపై పూర్తిగా ఆధారపడకుండా మామిడి, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. గత రబీ సీజన్‌లో జిల్లాలో సుమారు 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, దీంతో గోదాములు, రైస్ మిల్లులు పూర్తిగా నిండిపోయాయని తెలిపారు. అనంతరం జిల్లా ఉద్యాన శాఖ అధికారి లత, పొలాస వ్యవసాయ శాస్త్రవేత్త స్వాతి, కొమ్మ కత్తిరింపు నిపుణుడు భగవాన్ రైతులకు మామిడి తోటల




నిర్వహణ, కొమ్మల కత్తిరింపు పద్ధతులు, మందుల వినియోగం, నీటి యాజమాన్యం, దిగుబడి పెంపు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శోభన్, మార్కెట్ కమిటీ చైర్మన్ సంతోష్‌తో పాటు రైతులు, ఉద్యాన శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణలో ప్రభుత్వం విఫలం

**మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

**బలగం టీవీ, ఖమ్మం**

రాష్ట్రంలో పారిశుద్ధ్య నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే సమగ్ర కార్యాచరణ రూపొందించి పారిశుద్ధ్య సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఖమ్మం జిల్లాను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. పారిశుద్ధ్య లోపం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అనేక ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడం, మురుగు కాలువలను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్ర పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టి, వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పువ్వాడ అజయ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.



# ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

**-కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**ప్రజావాణిలో 169 వినతులు స్వీకరణ**

**బలగం టీవీ, కరీంనగర్**

ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాఖడే, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

**గృహ నిర్మాణ శాఖకు అత్యధిక వినతులు**

ప్రజావాణిలో మొత్తం 169 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో గృహ నిర్మాణ శాఖకు అత్యధికంగా 67 దరఖాస్తులు, కరీంనగర్ నగరపాలక సంస్థకు 54 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ప్రజల సమస్యలను శాఖల వారీగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# కేజీబీవీలో హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**- జూలై 10 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**- 18 నుంచి 45 ఏళ్లలోపు మహిళా అభ్యర్థులకు అవకాశం**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులను అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ పోస్టులకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతలు, చిరునామాకు సంబంధించిన ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో కూడిన దరఖాస్తులను లిలిజూలై 10, 2026 సాయంత్రం 5 గంటలలోపులిలి సిరిసిల్ల మండల వనరుల కేంద్రం (ఎంఆర్సీ) కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

**అర్హతలు**

2026 జూన్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసి, 45 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని అధికారులు స్పష్టం చేశారు.

**వివరాలకు ఎంఆర్సీ కార్యాలయాన్ని సంప్రదించాలి**

పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎంపిక విధానం తదితర సమాచారం కోసం సిరిసిల్ల మండల వనరుల కేంద్రం (ఎంఆర్సీ) కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు.



# పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి...

**-జిల్లా పోలీసులకు రెయిన్ కోట్స్ పంపిణీ.**

**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

పోలీసు సిబ్బంది సంక్షేమన్ని దృష్టిలో ఉంచుకొని విధి నిర్వహణకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. జిల్లా పోలీసు సిబ్బందికి మంజూరైన రెయిన్ కోట్స్‌ను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మహేష్ బి. గితే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ వర్షాకాలంలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని హైదరాబాదులోని డీజీపీ కార్యాలయం నుండి మంజూరు అయిన రెయిన్ కోట్స్‌ను పోలీస్ సిబ్బందికి అందజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



# జూనోటిక్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**డీఎంహెచ్‌వో డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్**

**నేరెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు వ్యాపించే జూనోటిక్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ సూచించారు. ప్రపంచ జూనోటిక్ వ్యాధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నేరెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మందుల లభ్యతను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

**పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకాలు**

ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రేబీస్, బ్రూసెల్లోసిస్, లెప్టోస్పిరోసిస్, బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ వంటి వ్యాధులు జంతువుల ద్వారా వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని, కుక్కలు లేదా ఇతర జంతువులు కరిస్తే గాయాన్ని వెంటనే సబ్బు, శుభ్రమైన నీటితో కనీసం 15 నిమిషాల పాటు కడిగి, ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో యాంటీ రేబీస్ టీకా తీసుకోవాలని తెలిపారు.

**వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యం**

మాంసాహార పదార్థాలను పూర్తిగా ఉడికించి మాత్రమే తీసుకోవాలని, పాలను మరిగించి తాగాలని సూచించారు. జంతువులను సంరక్షించే వారు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. అనారోగ్యంతో ఉన్న జంతువులను తాకకుండా వెంటనే పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

**సమన్వయంతోనే వ్యాధుల నియంత్రణ**

జూనోటిక్ వ్యాధుల నివారణలో ప్రజలతో పాటు వైద్య, పశుసంవర్ధక, స్థానిక సంస్థలు, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేస్తే వ్యాధులను సమర్థవంతంగా నియంత్రించవచ్చని డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేరెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. చంద్రిక రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

**- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్జిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 144 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రజావాణి కి వచ్చే దరఖాస్తులు నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. హైదరాబాద్ లో నిర్వహించే ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిశీలించి.. పరిష్కరించాలని సూచించారు.

సిరిసిల్ల, వేములవాడ లో..

సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించి,ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సిరిసిల్ల ప్రజావాణికి 4, వేములవాడ ప్రజావాణికి రెండు దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందించి.. పరిష్కరించాలని ఆదేశించారు.ఇక్కడ ప్రజావాణిలో జిల్లా అటవీ



శాఖ అధికారి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే..



**-గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 32 ఫిర్యాదులు స్వీకరణ..**

**-జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 32 ఫిర్యాదులను ఎస్పీ మహేష్ బి.గితే స్వీకరించినారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

# బెంగాల్ మాదిరిగా మన ఓట్లను తొలగించే కుట్ర..

**-ఓటర్ నమోదు గడువు ఆగస్టు 30వరకు పొడిగించాలి**

**-సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు 90 లక్షల ఓటర్లను తొలగించిన మాదిరిగానే తెలంగాణ రాష్ట్రంలో కూడా సర్ పేరుతో ఓటర్లను తొలగించే కుట్ర జరుగుతుందని,ఓటును కాపాడుకోవడానికి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు అన్నారు.సోమవారం సిరిసిల్ల పట్టణంలో ని బీ వై నగర్ లోని అమృత లాల్ శుక్లా భవన్ లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించగా,ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టీ స్కైలాబ్ బాబు మాట్లాడుతూ

జూన్ 25 నుండి రాష్ట్రంలో అమలవుతున్న సర్ ఓటర్ల నమోదు కార్యక్రమంలో కేవలం 30 శాతం మందికి మాత్రమే ఫారాలు అందాయని ఇంకా70 శాతం మందికి ఫారాలు అందాల్సి ఉందన్నారు.నిరక్షరాస్యులైన పేదలు ఫారం నింపలేని పరిస్థితిలో ఉన్నారని, వివిధ సాంకేతిక కారణాలతో పారం సరిగా లేదనే పేరిట ఓటర్లకు తొలగించే ప్రయత్నం జరుగుతుందన్నారు.

2002 సం లో ఓటు షరతు పెట్టడాన్ని ఖండించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఏ ఒక్క ఓటుకు నష్టం కలగకూడదని,పేదలకున్న ఏకైక ప్రజాస్వామ్య ఆయుధం ఓటు హక్కు మాత్రమేనని,దళితులు మైనారిటీలు గిరిజనులు వెనకబడిన తరగతుల ఓట్లు పోయే ప్రమాదం ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జర్నలిస్టు ప్రశ్న రావణ్ ఉప ముఖ్య మంత్రి,పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతుందని ,ఉపాకేసు పెట్టి జైల్లో నిర్బంధించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రశ్నించడం నేరం కాదని రాజ్యాంగంలో ఆర్టికల్ 19 భావ ప్రకటన స్వేచ్ఛను వ్యక్తం చేస్తుందని ,తక్షణమే ప్రశ్న రావణ్ పై పెట్టిన ఉపాకేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు .వర్షాకాలం ప్రారంభమైనందున వైద్యం పేదలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని, విష జ్వరాలను ప్రభులే అవకాశం ఉన్నందున తక్షణమే డాక్టర్లు మందులు సౌకర్యాలు పేదలకు అందుబాటులో ఉండాలన్నారు .ప్రభుత్వ విద్య వైద్యంపై సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా క్యాంపెయిన్ చేపడుతుందన్నారు సిరిసిల్ల జిల్లాలో కూడా పాఠశాల వైద్యశాల సమస్యలను తెలియజేస్తామని అన్నారు.

ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జవ్వాజి విమల, కోడం రమణ పట్టణ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్ నాయకురాలు ఆడెపు రజిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలి



**కలెక్టర్ గరిమా అగర్వాల్**

**లిమండేపల్లి గురుకుల జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ**

**ఆహారం, వసతి, విద్యా సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

విద్యార్థులు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే స్పష్టమైన లక్ష్యంతో, ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. సోమవారం తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలను (టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ) కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యా, వసతి, ఆహార ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి**

ముందుగా స్టోర్‌రూమ్‌ను సందర్శించిన కలెక్టర్ బియ్యం, పప్పులు, గుడ్లు తదితర నిత్యావసర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని తనిఖీ చేసి, మెనూ ప్రకారమే నాణ్యమైన ఆహారం అందించాలని అధికారులను ఆదేశించారు.

భోజనశాలలో విద్యార్థులతో కలిసి కూర్చొని భోజనం చేసిన కలెక్టర్ వారి సమస్యలు, వసతి, విద్యా సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం కోడిగుడ్లు, పాలు, ఇతర పోషకాహార పదార్థాలు అందుతున్నాయా అని విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివితే విజయాన్ని సాధించగలరని అన్నారు. విద్యతో పాటు ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ అవసరమని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య, వసతి సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# చేపల ఉత్పత్తి పెంపుతో మత్స్యకారుల ఆదాయం రెట్టింపు లక్ష్యం

**మత్స్య అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్ గరిమా అగర్వాల్**

**నర్సింగాపూర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించిన వరల్డ్ బ్యాంక్ బృందం**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ప్రభుత్వం అమలు చేస్తున్న మత్స్య అభివృద్ధి పథకాలతో గ్రామీణ మత్స్యకారుల జీవనోపాధి బలోపేతం అవుతోందని, చేపల ఉత్పత్తి పెరగడంతో వారి ఆదాయం గణనీయంగా పెరుగుతోందని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు.

ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు కమిటీ సభ్యులు సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్‌తో సమావేశమై జిల్లాలో అమలవుతున్న మత్స్య అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘాలకు అందిస్తున్న ఆర్థిక సహాయం, చేప పిల్లల ఉత్పత్తి, మార్కెటింగ్, మత్స్యకారుల సంక్షేమానికి చేపడుతున్న చర్యలను కలెక్టర్ వివరించారు.

అనంతరం బృందం బోయినపల్లి మండలంలోని నర్సింగాపూర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించింది. చేప పిల్లల ఉత్పత్తి విధానం, కేంద్ర నిర్వహణ, ఆదాయ వనరులు, ప్రభుత్వ సహకారంపై క్షేత్రస్థాయిలో పరిశీలించింది.

చేపల ఉత్పత్తి పెరగడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు మత్స్యకార కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని అధికారులు తెలిపారు. మత్స్యకారుల ఆదాయాన్ని మరింత పెంచే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు జూలియన్ మిలియన్, అనుజా శుక్లా, ఆర్పీ సిలార్డ్, ఇంతిసార్ ఎ. సిద్దిఖీ, దీపా సుమన్, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్యతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ 'సప్తపది'..

- నల్గొండ నైట్స్‌పై ఘన విజయం!
- ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా సరికొత్త రికార్డు..
- ఉత్కంఠ పోరులో వైష్ణవ్ రెడ్డి విశ్వరూపం..
- ప్లేఆఫ్స్ రేసులోనే నల్గొండ!

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్, క్రీడా విభాగం: ఛాంపియన్స్ గ్రూప్ స్టేజ్ క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు అప్రతిహత విజయాల పరంపరను కొనసాగిస్తూ సరికొత్త రికార్డు సృష్టించింది. నల్గొండ నైట్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తద్వారా ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోకుండా వరుసగా ఏడో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. నల్గొండ నిర్దేశించిన 188 పరుగుల భారీ లక్ష్యాన్ని హైదరాబాద్ జట్టు 19.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వైష్ణవ్ రెడ్డి (16 బంతుల్లో 41), అన్విత్ రెడ్డి (40), కెప్టెన్ అభిరథ్ రెడ్డి (39), అజయ్ గౌడ్ (35 నాటౌట్) రాణించి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు.



**18వ ఓవర్లో 'వైష్ణవ్' తుఫాన్!**

ఛేదనలో ఒక దశలో హైదరాబాద్ 11.2 ఓవర్లకు 105 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అన్విత్ రెడ్డి (40) కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును ఆదుకున్నా, 15.2 ఓవర్ వద్ద అతను అవుటవడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. హైదరాబాద్ గెలవడానికి 18 బంతుల్లో 39 పరుగులు కావాల్సిన దశలో నల్గొండకే గెలుపు అవకాశాలు ఎక్కువగా కనిపించాయి. కానీ, సతాని వేసిన 18వ ఓవరో వైష్ణవ్ రెడ్డి చెలరేగిపోయాడు. ఒకే ఓవర్లో ఏకంగా నాలుగు భారీ సిక్సర్లు బాది 26 పరుగులు రాబట్టాడు. దీంతో మ్యాచ్ ఒక్కసారిగా హైదరాబాద్ వైపు తిరిగింది. 19వ ఓవర్లో 8 పరుగులు రాగా, 20వ ఓవర్ తొలి బంతికే వైష్ణవ్ సిక్స్ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు.

**వరుణ్ గౌడ్ హాఫ్ సెంచరీ వృథా**

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన నల్గొండ నైట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 187 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు జశ్వంత్ (36), గౌరవ్ (25) రాణించగా, వరుణ్ గౌడ్ (53) బాధ్యతాయుత హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆఖర్లో హర్షవర్ధన్ సింగ్ (11 బంతుల్లో 23) మెరుపులు మెరిపించడంతో నల్గొండకు ఆ స్కోరు లభించింది. హైదరాబాద్ బౌలర్లలో షణ్ముక అశ్విన్ 4 వికెట్లతో నల్గొండ నడుం విరగ్గా, అజయ్ దేవ్, ప్రణవ్ వర్మ చెరో 2, అఖిల్ రాథోడ్ ఒక వికెట్ పడగొట్టారు.

**నల్గొండ ప్లేఆఫ్స్ ఆశలు సజీవం**

ఈ ఓటమితో నల్గొండ నైట్స్ ఏడు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలు, 8 పాయింట్లతో ప్రస్తుతం పట్టికలో మూడో స్థానంలో ఉంది. నల్గొండ ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే నేడు జరగబోయే రంగారెడ్డి, కరీంనగర్ జట్ల మ్యాచ్‌ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. కరీంనగర్ తమ చివరి మ్యాచ్‌లో గెలిచి, రంగారెడ్డి కూడా భారీ తేడాతో విజయం సాధిస్తే రన్ రేట్ ఆధారంగా నల్గొండ టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. లేదంటే ప్లేఆఫ్స్‌కు చేరుకుంటుంది. రేపటి మ్యాచ్‌లతో ప్లేఆఫ్స్ రేసుపై పూర్తి స్పష్టత రానుంది.

**స్కోరు బోర్డు:**

నల్గొండ నైట్స్: 20 ఓవర్లలో 187/9 (వరుణ్ గౌడ్ 53, జశ్వంత్ 36; షణ్ముక అశ్విన్ 4/రన్ రేట్)

హైదరాబాద్: 19.1 ఓవర్లలో 188/5 (వైష్ణవ్ రెడ్డి 41, అన్విత్ రెడ్డి 40, అభిరథ్ రెడ్డి 39)

ఫలితం: హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో విజయం.






# జింబాబ్వే పర్యటనకు భారత జట్టు ప్రకటన..

**సంజూ శాంసన్‌పై వేటు!**
**శ్రేయాస్ అయ్యర్‌కు సారథ్య బాధ్యతలు..**
**ఐర్లాండ్ చేతిలో వైట్‌వాష్‌తో కీలక మార్పులు..**
**జట్టులోకి ఐపీఎల్ యువ సంచలనాలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐర్లాండ్ చేతిలో ఎదురైన ఘోర వైట్‌వాష్ పరాజయం తర్వాత భారత క్రికెట్ సెలెక్టర్లు రాబోయే జింబాబ్వే పర్యటన కోసం ప్రకటించిన భారత టీ20 జట్టులో సెలెక్షన్ కమిటీ భారీ మార్పులు చేశారు. ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైన వారిలో సగం మందిని తప్పించి, ఐపీఎల్ మరియు దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన యువ ఆటగాళ్లకు పెద్దపీట వేశారు. ఓపెనర్‌గా వరుసగా విఫలమవుతున్న కేరళ స్టార్ సంజూ శాంసన్‌పై సెలెక్టర్లు వేటు వేశారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్టర్ల బృందం సోమవారం ముంబైలో సమావేశమై, శ్రేయాస్ అయ్యర్ సారథిగా 15 మందితో కూడిన సరికొత్త స్క్వాడ్‌ను ప్రకటించింది. యువ సంచలనం తిలక్ వర్మకు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు.

**బౌలింగ్ దళంలో 'ఐపీఎల్' జోరు!**

ఐర్లాండ్ పర్యటనలో బౌలింగ్ వైఫల్యాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి సెలెక్టర్లు సరికొత్త బౌలింగ్ అటాక్‌ను రంగంలోకి దించుతున్నారు. ఐపీఎల్ 19వ సీజన్‌లో తమ వేగంతో, స్పిన్‌తో మెరిసిన యువ ఫాస్ట్ బౌలర్లు మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్, అశోక్ శర్మలతో పాటు హర్ష్ దూబేలకు బౌలింగ్ దళంలో చోటు దక్కించుకున్నారు. అలాగే మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, యశ్ ఠాకూర్‌లు తమ స్థానాలను నిలబెట్టుకున్నారు.

**సూర్యవంశీకి మరో ఛాన్స్.. ప్రభ్‌సిమ్రన్‌కు పిలుపు**

ఓపెనర్‌గా సంజూ శాంసన్‌ను పక్కనపెట్టిన సెలెక్టర్లు.. యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీకి మరో సువర్ణ అవకాశాన్ని ఇచ్చారు. అతను అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఇక వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌కు బ్యాకప్‌గా పంజాబ్ హిట్టర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్‌ను ఎంపిక చేశారు. మిడిలార్డర్ బలాన్ని పెంచేందుకు సూర్యాన్ష్ షెడ్గేను, ఫినిషర్‌గా నమ్మకమైన ఆటగాడు రింకూ సింగ్‌ను జట్టులోకి తీసుకున్నారు. సీనియర్ ఆల్‌రౌండర్ శివం దూబే కూడా జట్టులో చోటు దక్కించుకున్నాడు. భారత్, జింబాబ్వే జట్ల మధ్య జూలై 23 నుంచి హరారే వేదికగా మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది.

**జింబాబ్వే టూర్‌కు భారత జట్టు ఇదే:**

శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), శివం దూబే, సూర్యాన్ష్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్.

**జింబాబ్వేతో టీ20 సిరీస్ షెడ్యూల్**

తొలి టీ20 – జులై 23 – గురువారం – హరారే మైదానం– సాయంత్రం 4.30 గంటలకు
రెండో టీ20 – జులై 25 – శనివారం – హరారే మైదానం – సాయంత్రం 4.30 గంటలకు
మూడో టీ20 – జులై 26 – ఆదివారం – హరారే మైదానం – సాయంత్రం 4.30 గంటలకు

# బ్రెజిల్‌కు షాక్.. ప్రపంచకప్ నుంచి అవుట్!

**నార్వే చేతిలో 2-1 తేడాతో పరాజయం.. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు నెయ్‌మర్ సంచలన రిటైర్మెంట్**





**బలగం టీవీ, న్యూయార్క్**

అమెరికాలోని ప్రతిష్టాత్మక మెట్‌లైఫ్ స్టేడియం వేదికగా జరిగిన ప్రపంచకప్ 2026 ప్రీ–క్వార్టర్స్ మ్యాచ్‌లో ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన బ్రెజిల్ జట్టు నార్వే చేతిలో 2–1 తేడాతో ఊహించని పరాజయాన్ని చవిచూసింది. ఆరోసారి ప్రపంచకప్‌ను ముద్దాడాలనే కలతో బరిలోకి దిగిన బ్రెజిల్‌కు ఈసారి ప్రీ–క్వార్టర్స్‌లోనే తమ ప్రయాణాన్ని ముగించాల్సి వచ్చింది. ఈ ఘోర ఓటమి తర్వాత ప్రపంచ ఫుట్‌బాల్‌లో ప్రతిభావంతుడైన ఆటగాడిగా, బ్రెజిల్ అభిమానుల గుండె చప్పుడుగా నిలిచిన స్టార్ ఫార్వర్డ్ ప్లేయర్ నెయ్‌మర్ జూనియర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన అంతర్జాతీయ ఫుట్‌బాల్ కెరీర్‌కు అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించారు.

**కన్నీటిపర్యంతమైన స్టార్ ఆటగాడు**

మ్యాచ్ ముగిసిన వెంటనే నెయ్‌మర్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. మైదానంలోనే కన్నీరు మున్నీరవుతూ అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించారు. బ్రెజిల్ తరపున ఆల్–టైమ్ అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించిన నెయ్‌మర్ నిష్క్రమణతో బ్రెజిల్ ఫుట్‌బాల్‌లో ఒక అద్భుతమైన శకం ముగిసినట్టు అయ్యింది. ఈ వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

**నార్వే సంచలన విజయం ---**
**తొలిసారి ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్లోకి**

ఫుట్‌బాల్‌లో తిరుగులేని శక్తిగా భావించే బ్రెజిల్ జట్టుపై నార్వే సరికొత్త చరిత్ర సృష్టించింది. మ్యాచ్ ప్రారంభం నుంచి ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మ్యాచ్ ద్వితీయార్థంలో నార్వే స్టార్ స్ట్రైకర్, మాంచెస్టర్ సిటీ సంచలనం ఎర్లింగ్ హాలాండ్ చెలరేగిపోయాడు. ఆట 79వ నిమిషంలో నార్వే ఆటగాడు ఆంద్రియాస్ షెల్డెరప్ అద్భుతమైన క్రాస్‌ను అందించగా, దాన్ని హాలాండ్ అత్యంత ఎత్తుకు లేచి బ్రెజిల్ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. దీంతో నార్వే 1–0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

మొదటి గోల్ ఇచ్చిన షాక్ నుంచి బ్రెజిల్ కోలుకోకముందే, హాలాండ్ మరోసారి తన ప్రతాపం చూపించాడు. బ్రెజిల్ డిఫెన్స్ లోపాలను అనుకూలంగా మార్చుకుంటూ మ్యాచ్ ముగియడానికి కొన్ని నిమిషాల ముందు ఆయన వ్యక్తిగతంగా రెండో గోల్ సాధించి నార్వే ఆధిక్యాన్ని 2–0కు పెంచాడు. ఈ గోల్‌తో హాలాండ్ ప్రస్తుత టోర్నీలో మొత్తం 7 గోల్స్ పూర్తి చేసుకుని లియోనెల్ మెస్సి, కిలియన్ ఎంబాప్పెల సరసన 'గోల్డెన్ బూట్' రేసులో నిలిచాడు.

**ఆఖరి నిమిషంలో నెయ్‌మర్ గోల్.. కానీ..**

మ్యాచ్ ఇంజ్యూరీ టైమ్ 10వ నిమిషంలో బ్రెజిల్ సీనియర్ ఆటగాడు కాసెమిరోపై నార్వే డిఫెండర్ లియో ఓస్టిగార్డ్ ఫౌల్ చేయడంతో బ్రెజిల్‌కు పెనాల్టీ లభించింది. ఈ పెనాల్టీని నెయ్‌మర్ ఎటువంటి తప్పు చేయకుండా గోల్‌గా మలిచాడు. ఈ ప్రపంచ కప్‌లో నెయ్‌మర్‌కు ఇదే మొదటి గోల్ కావడం గమనార్హం. అయితే, అప్పటికే సమయం మించిపోవడంతో బ్రెజిల్ 2–1తో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఈ విజయంతో నార్వే తన ఫుట్‌బాల్ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ తొలిసారిగా ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టింది.




# ఇదే నాకు చివరి ప్రపంచ కప్

**స్పెయిన్‌తో ప్రిక్వార్టర్స్ పోరుకు ముందు పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో సంచలన ప్రకటన!**

**బలగం టీవీ, లండన్**

పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో కెరీర్‌పై కొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు తెరపడింది. ప్రస్తుత ఫిఫా ప్రపంచ కప్ 2026 టోర్నీలో అతడి ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, ఆటకు వీడ్కోలు పలికే సమయం వచ్చిందంటూ సామాజిక మాధ్యమాల్లో అభిమానులు, విమర్శకులు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రొనాల్డో తన అంతర్జాతీయ కెరీర్‌పై అత్యంత కీలక ప్రకటన చేశాడు. ఈ ప్రపంచ కప్ తన కెరీర్‌లో చివరి టోర్నీ అని అతడు స్పష్టం చేశాడు. స్పెయిన్‌తో జరగబోయే కీలకమైన ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌కు ముందు రొనాల్డో మీడియాతో మాట్లాడాడు. ఈ టోర్నీ తర్వాత ప్రపంచ కప్ వేదికలపై తాను ఇక కనిపించబోనని వెల్లడించాడు. "ఈ ప్రపంచ కప్‌ను పూర్తిగా ఆస్వాదించాలని అనుకుంటున్నా. ఎందుకంటే ఇదే నా చివరి వరల్డ్ కప్. అయితే రేపు స్పెయిన్‌తో జరగబోయే మ్యాచ్ నా చివరి ప్రపంచ కప్ మ్యాచ్ కాకూడదని ఆశిస్తున్నా" అని రొనాల్డో భావోద్వేగంతో పంచుకున్నాడు. ప్రస్తుతం 41 ఏళ్ల వయసున్న రొనాల్డో తన కెరీర్‌లో ఇది ఆరో ప్రపంచ కప్ ఆడుతుండటం విశేషం.

**నా రిటైర్మెంట్.. అది నేనే నిర్ణయిస్తా!**

తన రిటైర్‌మెంట్‌పై సోషల్ మీడియాలో వస్తోన్న ఊహాగానాలపై రొనాల్డో ఘాటుగా స్పందించాడు. "నేను ఎప్పుడు రిటైర్ కావాలో నేనే నిర్ణయిస్తాను, ఇతరులు చెప్పినప్పుడు కాదు. ఆ విషయంపై పదే పదే ప్రశ్నించడం అనవసరం. జాతీయ జట్టు కోసం ఎప్పుడూ శరీరాన్ని, మనసును అంకితం చేస్తాను. మైదానంలో ఆడినా, ఆడకపోయినా జట్టుకు నా వంతు బాధ్యతను నిర్వర్తిస్తాను" అని స్పష్టం చేశాడు. ప్రస్తుతం జట్టు దృష్టంతా రేపటి మ్యాచ్‌పైనే ఉందని, ప్రపంచ కప్ గెలవాలనే నమ్మకం లేకపోతే తాము ఇక్కడి వరకు వచ్చే వాళ్లం కాదని ధీమా వ్యక్తం చేశాడు. ఈ ప్రయాణం అద్భుతంగా సాగుతోందని, ప్రతి మ్యాచ్‌కు ఆట మెరుగుపడుతోందని చెప్పాడు. ఇప్పటికే ఎన్నో బలమైన జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాయని గుర్తు చేస్తూ.. తమ జట్టు ప్రశాంతంగా ఉందని, సరైన ప్రణాళికతో, పూర్తి సన్నద్ధతతో బరిలోకి దిగుతున్నామని రొనాల్డో ధీమా వ్యక్తం చేశాడు.

# ముగిసిన ఆతిథ్య మెక్సికో కథ

**క్వార్టర్స్‌కు ఇంగ్లండ్!**
**హోరాహోరీ పోరులో 3-2 తేడాతో మెక్సికో పరాజయం..**
**బెల్లింగ్‌హామ్ 'డబుల్' ధమాకా!**

**బలగం టీవీ, న్యూయార్క్**

ఫిఫా వరల్డ్‌కప్‌లో ఆతిథ్య జట్టు మెక్సికో ప్రస్థానం ముగిసింది. ప్రతిష్టాత్మక అజ్‌టెకా స్టేడియంలో జరిగిన రౌండ్–16 (ప్రిక్వార్టర్స్) హోరాహోరీ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 3–2 గోల్స్ తేడాతో మెక్సికోపై సంచలన విజయం సాధించింది. స్వంత గడ్డపై ఆడుతున్న మెక్సికో జట్టు ఆఖరి నిమిషం వరకు తీవ్రంగా పోరాడినప్పటికీ ఫలితం దక్కలేదు. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ మ్యాచ్‌ను గంట ఆలస్యంగా ప్రారంభించారు. సొంత మైదానంలో ఆడిన గత 89 మ్యాచుల్లో కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఓడిన రికార్డు ఉన్న మెక్సికోకు, ఇంగ్లండ్ చాకచక్యమైన ఆటతీరుతో గట్టి షాక్ ఇచ్చింది. 98 సెకన్ల వ్యవధిలో రెండు గోల్స్!

ఇంగ్లండ్ స్టార్ ప్లేయర్ జూడే బెల్లింగ్‌హామ్ తొలి అర్ధభాగంలో అద్భుత ప్రదర్శన చేశాడు. కేవలం 98 సెకన్ల తేడాతో బ్యాక్–టు–బ్యాక్ రెండు గోల్స్ చేసి మ్యాచ్‌ను ఇంగ్లండ్ వైపు తిప్పాడు. ఆట 36, 38వ నిమిషాల్లో అతను గోల్స్ చేసి ఇంగ్లండ్‌కు తిరుగులేని ఆధిక్యాన్ని అందించాడు. గోల్‌కీపర్ పిక్‌ఫోర్డ్ అద్భుత డిఫెన్స్

మరోవైపు ఇంగ్లండ్ గోల్ కీపర్ జోర్డాన్ పిక్‌ఫోర్డ్ తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మెక్సికో స్టార్ ప్లేయర్ రౌల్ జిమినేజ్ కొట్టిన రెండు అద్భుతమైన



గోల్ షాట్లను పిక్‌ఫోర్డ్ చాకచక్యంగా అడ్డుకున్నాడు. అయితే, మెక్సికో ప్లేయర్ జులియన్ క్విన్నోస్ ఒక గోల్ చేసి ఆ జట్టులో ఆశలు రేపాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ ప్లేయర్ కేన్ 60వ నిమిషంలో మూడో గోల్ చేయగా, మెక్సికో తరపున 69వ నిమిషంలో జిమినేజ్ మరో గోల్ సాధించినా, అప్పటికే ఆలస్యం కావడంతో మెక్సికోకు ఓటమి తప్పలేదు.

# ఫిఫా వరల్డ్‌కప్‌లో సంచలనం..
# ట్రంప్ ఫోన్‌తో బలోగన్‌పై సస్పెన్షన్ అవుట్!

**. తీవ్రంగా తప్పుపట్టిన బెల్జియం ఫుట్‌బాల్ సమాఖ్య**

**బలగం టీవీ, న్యూయార్క్**




ఫిఫా వరల్డ్‌కప్‌లో ఆతిథ్య అమెరికా జట్టు చరిత్రాత్మక ప్రదర్శనతో దూసుకుపోతున్న వేళ ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రౌండ్–16లో ఇవాళ బెల్జియం జట్టుతో అమెరికా తలపడనున్న నేపథ్యంలో.. ఆ దేశ స్టార్ ఫార్వర్డ్ ప్లేయర్ ఫోలారిన్ బలోగన్‌పై ఉన్న ఒక మ్యాచ్ సస్పెన్షన్‌ను ఫిఫా ఎత్తివేసింది. బోస్నియాతో జరిగిన రౌండ్–32 మ్యాచ్‌లో బలోగన్‌కు రెడ్ కార్డ్ జారీ కావడంతో నిబంధనల ప్రకారం అతను ఈ మ్యాచ్‌కు దూరం కావాల్సి ఉంది. అయితే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నేరుగా రంగంలోకి దిగి ఫిఫా అధికారులతో మాట్లాడటంతో ఈ సస్పెన్షన్ రద్దయినట్లు తెలుస్తోంది. ప్రస్తుత టోర్నీలో అమెరికా తరపున బలోగన్ ఇప్పటికే మూడు గోల్స్ చేసి అత్యంత కీలక ప్లేయర్‌గా మారాడు.

**64 ఏళ్ల చరిత్రలో ఇదే తొలిసారి!**

ఫుట్‌బాల్ టోర్నీల నిబంధనల ప్రకారం రెడ్ కార్డు పొందిన ప్లేయర్‌పై తక్షణమే ఓ మ్యాచ్ నిషేధం అమలులోకి వస్తుంది. కానీ, బలోగన్ అంశాన్ని తేల్చేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్వయంగా ఫిఫా అధ్యక్షుడు గియన్ని ఇన్‌ఫాంటినోకు ఫోన్ చేసి, నిర్ణయాన్ని సమీక్షించాలని కోరినట్లు సమాచారం. దీంతో బెల్జియంతో జరిగే కీలక పోరులో అతను ఆడేందుకు ఫిఫా అనుమతి ఇచ్చింది. కాగా, 1962 తర్వాత రెడ్ కార్డు జారీ చేసిన ప్లేయర్‌పై ఇలా సస్పెన్షన్ ఎత్తివేయడం అంతర్జాతీయ ఫుట్‌బాల్ చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.

**బెల్జియం తీవ్ర ఆగ్రహం.. ట్రంప్ కృతజ్ఞతలు**

రాజకీయ జోక్యంతో బలోగన్‌పై సస్పెన్షన్ ఎత్తివేయడాన్ని బెల్జియం ఫుట్‌బాల్ సమాఖ్య తీవ్రంగా తప్పుపట్టింది. ఫిఫా తీసుకున్న ఈ పక్షపాత చర్య క్రీడా స్ఫూర్తికి విరుద్ధమని మండిపడింది. మరోవైపు, సస్పెన్షన్ వేటు రద్దు కావడంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆనందం వ్యక్తం చేశారు. ఆయన తన సోషల్ మీడియా అకౌంట్‌లో ఫిఫాకు ప్రెసిడెంట్ స్టైల్‌లో ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బలోగన్ పునరాగమనంతో నేడు జరగబోయే అమెరికా–బెల్జియం సమరం మరింత ఉత్కంఠభరితంగా మారనుంది.

# క్వార్టర్స్‌లో ఫ్రాన్స్.. ఎంబాపె 'కిలియన్' మ్యాజిక్!



**పరాగ్వేపై 1-0తో విజయం.. వరుసగా నాలుగోసారి క్వార్టర్స్‌కు మాజీ ఛాంపియన్..**
**గోల్డెన్ బూట్ రేసులో మెస్సీతో సమానంగా ఎంబాపె**

**బలగం టీవీ, న్యూయార్క్**

: రెండుసార్లు ప్రపంచ చాంపియన్ ఫ్రాన్స్ ఫిఫా వరల్డ్ కప్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. ఆదివారం తెల్లవారుజామున అత్యంత నాటకీయంగా సాగిన ప్రిక్వార్టర్స్ పోరులో ఫ్రాన్స్ 1–0 గోల్ తేడాతో పరాగ్వేను చిత్తు చేసి వరుసగా నాలుగోసారి క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. ఆ జట్టు సారథి, స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపె పెనాల్టీని గోల్‌గా మలిచి జట్టుకు ఈ అద్భుత విజయాన్ని అందించాడు. ఈ టోర్నీలో అతడికిది ఏడో గోల్ కావడం విశేషం. ఈ విజయంతో ఫ్రాన్స్.. గురువారం జరిగే క్వార్టర్స్ పోరులో మొరాకోను ఢీకొననుంది.

**పరాగ్వే గిల్లికజ్జాలు.. చెత్త ఆట!**

రౌండ్–32లో అగ్రశ్రేణి జట్టు జర్మనీని ఓడించిన పరాగ్వే.. ఈ మ్యాచ్‌లో మాత్రం ఘోరంగా విఫలమైంది. మ్యాచ్‌లో గోల్స్ చేయడం కంటే ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లను కవ్విస్తూ, భౌతిక దాడులకు దిగడంపైనే ఎక్కువ దృష్టి సారించింది. ముఖ్యంగా ఎంబాపెను లక్ష్యంగా చేసుకుని మైండ్ గేమ్ ఆడింది. ఫస్టాఫ్‌లో 85 శాతం బంతిని తమవద్దే ఉంచుకున్నా ఫ్రాన్స్ గోల్ చేయలేకపోయింది. పరాగ్వే గోల్‌కీపర్ ఒర్లాన్డో గిల్ అడ్డుగోడలా నిలిచి ఫ్రాన్స్ ప్రయత్నాలను తిప్పికొట్టాడు.

**ఎంబాపె మ్యాజిక్.. లభించిన పెనాల్టీ**

సుమారు గంటకు పైగా ఫ్రాన్స్‌ను నిలువరించిన పరాగ్వే.. డియాగో గొమెజ్ చేసిన తప్పిదంతో భారీ మూల్యం చెల్లించుకుంది. గోల్ వైపుగా దూసుకువస్తున్న ఫ్రాన్స్ ఆటగాడు డిజిరె డుయెకు గొమెజ్ అడ్డుపడటంతో ఫ్రాన్స్‌కు పెనాల్టీ లభించింది. దీనిని కెప్టెన్ ఎంబాపె రెండు చేతులా సద్వినియోగం చేసుకుంటూ గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించి బంతిని వలలోకి నెట్టాడు (1–0). పరాగ్వే ఆటగాళ్లు నానా రచ్చ చేసిన ఈ మ్యాచ్‌లో ఆ జట్టుకు ఒక్క ఎల్లో కార్డు కూడా రాకపోగా.. ఫ్రాన్స్‌కు మూడు పసుపు కార్డులు రావడం కొసమెరుపు.

**గోల్డెన్ బూట్ రేసు తారాస్థాయికి..**

ఈ గోల్‌తో కిలియన్ ఎంబాపె (7 గోల్స్) అర్జెంటీనా దిగ్గజం లియోనెల్ మెస్సీతో సమానంగా నిలిచి గోల్డెన్ బూట్ రేసును తారాస్థాయికి చేర్చాడు. వీరి తర్వాత హాలెండ్ (5), హ్యారీ కేన్ (5) ఉన్నారు. ఓవరాల్‌గా వరల్డ్‌కప్ చరిత్రలో మెస్సీ ఖాతాలో 20 గోల్స్ ఉండగా.. కేవలం 19 మ్యాచ్‌లు ఆడిన ఎంబాపె 19 గోల్స్‌తో రెండో స్థానంలో దూసుకుపోతున్నాడు.

# సంపాదకీయం

## రణరంగంగా మారిన జైలు

- 25 మంది మృతి, 100 మందికి తీవ్ర గాయాలు!

శ్రీలంకలోని ఓ ప్రధాన జైలులో ఖైదీల మధ్య జరిగిన రగడ తీవ్ర విషాదాన్ని నింపింది. రెండు డ్రగ్స్ ముఠాలకు చెందిన ఖైదీల మధ్య జరిగిన ఈ గొడవలో నలుగురు జైలు గార్డులతో సహా మొత్తం 25 మంది మరణించారు. మరో 100 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. గత ఐదేళ్ల కాలంలో శ్రీలంక జైళ్ల చరిత్రలోనే అది అత్యంత ఘోరమైన, అత్యంక ప్రాణాంతకమైన జైలు ఘర్షణగా అధికారులు సోమవారం ప్రకటించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కొలంబోకు ఉత్తరాన ఉన్న నెగొంబో ప్రాంతంలోని ప్రధాన జైలులో ఆదివారం సాయంత్రం ఈ ఘర్షణ ప్రారంభమైంది. వేలాది మంది ఖైదీలు ఉన్న ఈ జైల్లోని రెండు డ్రగ్స్ ముఠాల మధ్య మొదలైన గొడవ రాత్రంతా కొనసాగి రణరంగంగా మారింది. ఈ అల్లర్లను అదుపు చేయడానికి ప్రయత్నించిన నలుగురు జైలు గార్డులు కూడా ఖైదీల దాడిలో ప్రాణాలు కోల్పోయారు. సోమవారం ఉదయానికి పరిస్థితి పూర్తిగా చేజారిపోవడంతో అధికారులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. గాయపడిన జైలు సిబ్బందితో పాటు ఖైదీలను తక్షణమే నెగొంబోలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి డైరెక్టర్ పుష్ప గంలత్ మీడియాతో మాట్లాడుతూ.. తమ వైద్య కేంద్రానికి ఇప్పటివరకు 25 మృతదేహాలు వచ్చాయని.. గాయపడిన 100 మందికి పైగా ఖైదీలు, గార్డులకు అత్యవసర చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు. బాధితుల్లో కొందరికీ తుపాకీ గాయాలు కాగా..



మరికొందరిక పదునైన ఆయుధాల కోతలు, తీవ్రమైన గాయాలయ్యాయని ఆమె పేర్కొన్నారు. జైలు లోపల కాల్పుల శబ్దాలు వినిపించాయని స్థానికులు కూడా వెల్లడించారు. మరోవైపు జైలులో ఘర్షణల వార్త వ్యాపించడంతో పక్కనే ఉన్న మహిళా ఖైదీల విభాగంలో కూడా ఉద్రిక్తత నెలకొంది. తమను కూడా వెంటనే విడుదల చేయాలంటూ ఆదివారం రాత్రి మహిళా ఖైదీలు జైలు భవనం పైకప్పు పైకి ఎక్కి నిరసనకు దిగారు. ఈ క్రమంలో భవనం పైకప్పులోని ఒక భాగం కూలిపోవడంతో కొందరు మహిళా ఖైదీలకు కూడా గాయాలయ్యాయి. పరిస్థితిని సమీక్షించడానికి సోమవారం ఉదయం పోలీసు కమాండోలను రప్పించినప్పటికీ.. వారిని జైలు లోపలికి మాత్రం పంపలేదు. ఖైదీల ప్రాణాల గురించి ఆందోళనతో వారి కుటుంబసభ్యులు భారీ సంఖ్యలో జైలు బయట గుమిగూడారు. దీంతో ఆ ప్రాంతాన్ని పర్యవేక్షించడానికి ఎయిర్‌ఫోర్స్ రంగంలోకి దిగి డ్రోన్లు, హెలికాప్టర్లను మోహరించింది.

## పది ఏడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్




హైదరాబాద్, జూలై 6 : ఉద్యోగాల భర్తీలో భాగంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) సోమవారం టౌన్‌ప్లానింగ్ విభాగంలో పది అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. ఇవి మల్టీజోనల్ పోస్టులు కాగా, 18-44 ఏండ్ల మధ్య వయసు ఉన్న వారు పోటీపడొచ్చు.జూలై 1వ తేదీని కటాఫ్‌గా నిర్ణయించారు. వేతన స్కేల్ రూ. 58,850 నుంచి రూ. 1,37,050 మధ్య ఉంటుంది. బీఆర్క్, బీఈ, బీటెక్ (సివిల్), బీప్లానింగ్, ఎంఏ, ఎమ్మెస్సీ జియాలజీ, ఎమ్మెస్సీ జియో ఇన్ఫర్మేటిక్స్ కోర్సులు పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈనెల 10 నుంచి ఆగస్టు 17 వరకు అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించుకోవచ్చు.

## హైదరాబాద్ గడ్డపై తయారైన 'ఉగ్రం' రైఫిల్:




భారతదేశ రక్షణ రంగ (డిఫెన్స్) పటంలో హైదరాబాద్ అత్యంత కీలకమైన వ్యూహాత్మక హబ్‌గా అవతరిస్తోంది. ఐటీ రంగంలోనే కాకుండా, స్వదేశీ రక్షణ పరికరాల తయారీలోనూ భాగ్యనగరం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, 'ఆత్మనిర్భర్ భారత్' సాధనలో హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ రక్షణ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ క్రమంలోనే, హైదరాబాద్‌కు చెందిన 'ద్వీప డిఫెన్స్' ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన 'ఉగ్రం' (7.62x51 మి.మీ.) బ్యాటిల్ రైఫిల్ సరికొత్త రికార్డులు సృష్టిస్తూ రక్షణ దళాల కొనుగోలు ప్రక్రియకు సిద్ధమైంది. తెలంగాణ గడ్డపై తయారైన ఒక అత్యాధునిక ఆయుధం దేశ సరిహద్దులను రక్షించే స్థాయికి చేరుకోవడం హైదరాబాద్ రక్షణ రంగానికి గర్వకారణంగా నిలిచింది. డీఆర్డీవోకు చెందిన ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏఆర్డీఈ) భాగస్వామ్యంతో ద్వీప డిఫెన్స్ ఈ 'ఉగ్రం' రైఫిల్‌ను రూపొందించింది. కేవలం 100 రోజుల రికార్డు కాలంలోనే ఈ స్వదేశీ బ్యాటిల్ రైఫిల్‌ను డిజైన్ చేసి, ప్రోటోటైప్ సిద్ధం చేయడం రక్షణ రంగంలో హైదరాబాద్ ప్రైవేట్ పరిశ్రమల నైపుణ్యానికి, ప్రభుత్వ పరిశోధన సంస్థల సమన్వయానికి నిదర్శనం. ఆర్మీ, హోం శాఖ పరీక్షల్లో 'ఉగ్రం' కీలక విజయం 'ఉగ్రం' అసాల్ట్ రైఫిల్ కఠినమైన ఆర్మీ జనరల్ స్టాఫ్ క్వాలిటేటివ్ రిక్వైర్‌మెంట్ (GSQR) పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. వివిధ క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల్లో నిర్వహించిన ఫీల్డ్ ఎవాల్యుయేషన్ పరీక్షలను కూడా ఇది అధిగమించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సంబంధించిన బోర్డు ట్రయల్స్ సైతం పూర్తి కావడంతో, సీఆర్పీఎఫ్ (CRPF), ఐటీబీపీ (ITBP), ఎస్ఎస్‌బీ (ఎస్ఎస్‌బీ), ఎన్ఎస్‌జీ (NSG) వంటి ప్రధాన కేంద్ర సాయుధ పోలీసు దళాల కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగుతోందని కంపెనీ తెలిపింది. ద్వీప డిఫెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ సిబు జోసెఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. కంపెనీకి 2021లో రక్షణ పరికరాల తయారీ లైసెన్స్ లభించింది. ఆ వెంటనే తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో కేటాయించిన 13 ఎకరాల విస్తీర్ణంలోని ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యాన్ని నిర్మించారు. "మా ప్రయాణం కొద్ది కాలం క్రితమే ప్రారంభమైనప్పటికీ, నేడు హైదరాబాద్ కేంద్రంగా 100కు పైగా స్వదేశీ ఆయుధ వ్యవస్థలు కోర్ ప్లాట్‌ఫామ్‌లను అభివృద్ధి చేశాం. అందులో ఉగ్రం రైఫిల్ మా ప్రైడ్ ప్రొడక్ట్" అని సిబు జోసెఫ్ వెల్లడించారు. ఈ అత్యాధునిక రైఫిల్ పూర్తి గ్యాస్-ఆపరేటెడ్ రొటేటింగ్ బోల్ట్ వ్యవస్థతో పనిచేస్తుంది. సైనికుల సౌకర్యం కోసం దీని బరువును నాలుగు కిలోల కంటే తక్కువగానే ఉంచడం విశేషం. దీని ప్రభావవంతమైన ఫైరింగ్ రేంజ్ 500 మీటర్లుగా నిర్ధారించారు. కఠిన పర్వత ప్రాంతాల్లో, మంచు తుఫానుల్లో మరియు తీవ్రమైన ఉష్ణోగ్రతల్లో కూడా నిరాటంకంగా పనిచేసేలా దీనికి సంబంధించిన విశ్వసనీయత పరీక్షలు పూర్తయ్యాయి. 'ఉగ్రం'తో పాటు హైదరాబాద్ కేరాఫ్ డిఫెన్స్ 2018లో హైదరాబాద్‌లో ఏర్పాటైన ద్వీప డిఫెన్స్ కేవలం 'ఉగ్రం' బ్యాటిల్ రైఫిల్‌కే పరిమితం కాలేదు. యూ-19 సబ్‌మెషిన్ గన్, అత్యంత తేలికపాటి మెషిన్ గన్ యూ-45 అసాల్ట్ రైఫిల్, యూ-39 ప్లాట్‌ఫామ్, అలాగే ఉగ్రం రైఫిల్ ఆధారిత యాంటీ-డ్రోన్ వ్యవస్థలను సైతం హైదరాబాద్‌లోనే తయారు చేస్తోంది. అత్యంత సంక్లిష్టమైన ఆయుధ పరిజ్ఞానం కలిగిన హైదరాబాద్ నేడు గ్లోబల్ డిఫెన్స్ తయారీ మ్యాప్‌లో మరింత బలమైన ముద్ర వేస్తోంది. రక్షణ రంగంలో హైదరాబాద్ పోషిస్తున్న కీలక పాత్రకు, ఇక్కడి నుంచి రూపుదిద్దుకున్న 'ఉగ్రం' రైఫిల్ సాధించిన విజయమే పెద్ద నిదర్శనం. స్వదేశీ తయారీ రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ఏ విధంగా విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదో ఈ విజయం నిరూపిస్తోంది. దేశ భద్రతా దళాల అమ్ములపొదిలో చేరనున్న హైదరాబాద్ బ్రాండ్ ఆయుధం 'ఉగ్రం' భవిష్యత్తులో రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించనుంది.

## వాయుగుండంగా మారిన అల్పపీడనం..

- తెలంగాణలోని ఈ జిల్లాల్లో భారీ వర్షాలు



హైదరాబాద్,జూలై 06 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్రరూపం దాల్చి వాయుగుండంగా మారడంతో తెలంగాణ వాతావరణంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. భారత వాతావరణ శాఖ నివేదికల ప్రకారం..ఈ వాయుగుండం ప్రస్తుతం ఒడిశాలోని బాలాసోర్‌కు 50 కిలోమీటర్ల దూరంలో, చాంద్‌బలి, దిఘాలకు 60 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో పాటు ఉపరితల ఆవర్తనం, చురుగ్గా కదులుతున్న రుతుపవనాల కారణంగా తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటే.. మరికొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాలపై ఈ రుతుపవనాల ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసిం ది. ఇందులో భాగంగా నేడు ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. వర్షాలతో పాటు గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద లేదా విద్యుత్ స్తంభాల వద్ద నిలబడకుండా సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని విపత్తు నిర్వహణ శాఖ గట్టిగా సూచించింది. నిరంతర వర్షాల కారణంగా రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కాస్త తక్కువగా నమోదవుతాయని, దీనివల్ల ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు.మరోవైపు, హైదరాబాద్ దాని చుట్టుపక్కల పరిసర ప్రాంతాలలో సోమవారం వాతావరణం ఆహ్లాదకరంగా మారనుంది. గత కొన్ని రోజులుగా నగరంలో సాధారణ స్థితిలో నమోదవుతున్న వర్షపాతం, ఈ వారం మరింత పుంజుకునే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సోమవారం రోజంతా నగరంలో ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట తేలికపాటి నుండి మోస్తరు వర్షం లేదా జల్లులు పడే అవకాశం 45 శాతం వరకు ఉందని, రాత్రి వేళల్లో ఈ అవకాశం 10 శాతానికి తగ్గుతుందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది.నగరంలో గరిష్ట ఉష్ణోగ్రత 30 డిగ్రీల సెల్సియస్ గాను, కనిష్ట ఉష్ణోగ్రత 25 డిగ్రీల సెల్సియస్ గాను నమోదయ్యే అవకాశం ఉంది. పశ్చిమ దిశ నుంచి గంటకు 18 మైళ్ల వేగంతో చల్లటి గాలులు వీస్తుండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా, చల్లగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

## ప్రియుడి కోసం.. భర్త నరాలలోకి హార్పిక్ ఇంజక్షన్ ఎక్కించి హతమార్చిన ఇల్లాలు

ఇటీవల కాలంలో భర్తలను హతమారుస్తున్న భార్యల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. చిన్న చిన్న కారణాలకే భర్తలను కాటికి పంపిస్తున్న మహిళలు సమాజాన్ని షాక్ కు గురి చేస్తున్నారు. ముఖ్యంగా వివాహేతర సంబంధాలు అనేక దారుణ ఘటనల వెనుక కీలక కారణంగా మారుతున్నాయి. ఇక తాజాగా వివాహేతర సంబంధం పెట్టుకున్న ఒక మహిళ ప్రియుడి మోజులో భర్తను అత్యంత దారుణంగా హతమార్చిన ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. ప్రియుడి మోజులో పడిన ఒక ఇల్లాలు భర్తకు పీకల దాకా మందు తాగించి, ఆపై మద్యం మత్తులో ఉన్న భర్తకు బాత్ రూమ్ లు క్లీన్ చేసే హార్పిక్ లిక్విడ్ ను సిరెంజ్ తో ఇంజెక్షన్ చేసి హతమార్చిన ఘటన చోటు చేసుకుంది. టాయిలెట్ క్లీనర్ అయిన హార్పిక్ లిక్విడ్ ను భర్త శరీరంలోకి ఎక్కించి హతమార్చింది. నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకున్న ఈ దారుణ ఘటన వివరాలలోకి వెళితే.. నిజామాబాద్ పట్టణ శివారు ప్రాంతంలో ప్రశాంత్ సంధ్య కాపురం ఉంటున్నారు. అయితే భార్యాభర్తల మధ్య ఇటీవల కాలంలో విబేధాలు వచ్చాయి. గత కొంతకాలంగా సంధ్య వేరే వ్యక్తితో చనువుగా ఉంటుంది. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈక్రమంలో భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండగా, భర్తను తమకు అడ్డు తప్పించాలని సంధ్య ప్రియుడితో కలిసి ప్లాన్ చేసింది. పథకం ప్రకారం భర్త ప్రశాంత్ కు అతిగా మద్యం తాగించి, అతడు పూర్తిగా మత్తులోకి జారుకున్నాక ప్రియుడిని ఇంటికి పిలిపించింది. ఇద్దరూ కలిసి మద్యం ,మత్తులో ఉన్న ప్రశాంత్ పై తీవ్రంగా దాడి చేసి భవనంపై నుండి క్రిందికి తోసేశారు. అయినప్పటికీ అతను ప్రాణాలు కోల్పోలేదు. దీంతో అతడిని చంపాలని భావించిన భార్య సంధ్య ఇంట్లో ఉన్న హార్పిక్ లిక్విడ్ ను సిరంజీలోకి తీసుకుని నేరుగా భర్త నరాల్లోకి ఎక్కించింది. దీంతో అతను కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత భర్త మృతిని ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది సంధ్య, అయితే ప్రశాంత్ కుటుంబ సభ్యులకు సంధ్య తీరు అనుమానం కలిగించటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి సంధ్యను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. దీంతో సంధ్యతో పాటు ఆమె ప్రియుడిని కూడా అరెస్ట్ చేసిన పోలీసులు వారిని రిమాండ్ కు తరలించారు. భర్తకు హార్పిక్ లిక్విడ్ ఎక్కించి హతమార్చిన సంధ్య మానసిక స్థితి ఇటీవల కాలంలో స్త్రీలలో పెరుగుతున్న క్రిమినల్ నేచర్ ను స్పష్టంగా చూపిస్తుంది.

## హైడ్రా ఆకస్మిక తనిఖీ



హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న చారిత్రక హుస్సేన్‌సాగర్ పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ ముమ్మరమైంది. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న కట్టడాలపై నీటిపారుదల శాఖ నుంచి అందిన ఫిర్యాదుతో ఉన్నతాధికారుల బృందం ఉమ్మడిగా రంగంలోకి దిగింది. సోమవారం ముగ్గురు అధికారులు స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా నేతృత్వంలోని ఉన్నత స్థాయి బృందం సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణ స్థలాలను పరిశీలించింది. చెరువులు, ఇతర జలవనరుల పరిరక్షణే లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా నేతృత్వంలో ఈ స్థాయిలో ఉమ్మడి తనిఖీలు చేపట్టడం ప్రభుత్వ కఠిన వైఖరిని స్పష్టం చేస్తోంది. ఈ తనిఖీలకు ముఖ్య కారణం.. నీటిపారుదల శాఖ అధికారుల నుంచి అందిన రాతపూర్వక ఫిర్యాదు. హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ భారీ భవన నిర్మాణం చేపడుతోందని, ఈ ప్రాజెక్టుకు తమ శాఖ నుంచి ఎటువంటి ఎన్‌ఓసీ లేదా అనుమతులు తీసుకోలేదని ఇరిగేషన్ అధికారులు నిర్ధారించారు. దీనిపై హైడ్రాకు సమాచారం ఇచ్చారు. నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీంతో హైడ్రా అధికారులు ఈ ఉమ్మడి తనిఖీలను చేపట్టారు. నిర్మాణ స్థలానికి సంబంధించిన సరిహద్దు గుర్తులు, ఇరిగేషన్ మ్యాపులను నిశితంగా పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ ముంపు పరిధి ఎంతవరకు ఉంది, నిర్మాణ సంస్థ వేసిన పునాదులు ఏ హద్దుల్లో ఉన్నాయి అనే అంశాలపై రెవెన్యూ అధికారుల సాయంతో ప్రాథమిక క్రోడీకరణ చేశారు. అనుమతులు లేని పక్షంలో నిర్మాణాలను ఉపేక్షించే ప్రశ్నే లేదని తేల్చిచెప్పారు. భవన నిర్మాణానికి సంబంధించిన అనుమతుల పత్రాలు, జీహెచ్‌ఎంసీ జారీ చేసిన ప్లాన్ వివరాలు, అలాగే ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ రికార్డులను క్షుణ్ణంగా సరిపోల్చాలని కమిషనర్లు ఆదేశించారు. చట్టపరమైన నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే తదుపరి చర్యలు చాలా కఠినంగా ఉంటాయని ఈ సందర్భంగా స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ ఉమ్మడి తనిఖీలతో అక్రమ కట్టడదారుల్లో ఆందోళన మొదలైంది. ఈ వివాదాస్పద నిర్మాణంపై పూర్తి స్థాయి సమగ్ర విచారణ నివేదిక అందిన తర్వాత, సంబంధిత రికార్డులను తుదిసారిగా పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు సంయుక్త అధికారుల బృందం ప్రకటించింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించింది. చెరువుల సంరక్షణకు తమ విభాగాల మధ్య సమన్వయం కొనసాగుతుందని స్పష్టం చేసింది.

# ఫుల్ స్పీడ్‌లో రవితేజ..




'ఇరుముడి' రిలీజ్‌కు ముందే కొత్త సినిమా, శ్రీవిష్ణుతో మల్టీస్టారర్?

మాస్ మహారాజా రవితేజ వరుస ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు మరోసారి బిజీ షెడ్యూల్‌తో అభిమానులకు వరుస సినిమాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నటిస్తున్న ఆధ్యాత్మిక యాక్షన్ డ్రామా 'ఇరుముడి' చివరి దశ షూటింగ్‌లో ఉండగానే, మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాజా రాజా చోర' ఫేమ్ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ వినోదాత్మక చిత్రంలో నటించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి.హసిత్ గోలి శైలికి తగ్గట్టుగా హాస్యం, వినూత్న కథనం ప్రధాన బలాలుగా ఈ చిత్రాన్ని రూపొం దించనున్నట్లు సమా చారం. ఈ నెలలో పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించి, వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేం దుకు సన్నాహాలు చేస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల మేళవింపుగా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులను ఈ పాట బాగా ఆకట్టుకుంది. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం, కళ్యాణ్ చక్రవర్తి రచించిన సాహిత్యం, గాయకుడు అనంతు ఆలపించిన తీరు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మాస్ హీరోగా గుర్తింపు పొందిన రవితేజను డివోషనల్ లుక్‌లో చూడటం అభిమానులకు కొత్త అనుభూతిని కలిగిస్తోంది.ఒకవైపు 'ఇరుముడి' విడుదలకు సిద్ధమవుతుండగా, మరోవైపు కొత్త సినిమాను ప్రారంభించే దిశగా రవితేజ అడుగులు వేస్తున్నట్లు వార్తలు వస్తుండటం అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. అయితే హసిత్ గోలి ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

# మరో డైరెక్టర్‌తో నాని నెక్ట్స్ మూవీ లాక్..?

న్యాచురల్ స్టార్ నాని ప్రస్తుతం తన కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రం 'ది ప్యారడైజ్' షూటింగ్‌తో బిజీగా ఉన్నాడు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కాస్త ఆలస్యమవుతుండటంతో, నాని ఈ గ్యాప్‌లో తన నెక్ట్స్ చిత్రాల లైనప్‌ను సెట్ చేసుకునే పనిలో పడ్డాడు. ఇందులో భాగంగానే 'ది ప్యారడైజ్' తర్వాత సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' సినిమాను ఆయన ఇప్పటికే లైన్‌లో పెట్టాడు.ఇదిలా ఉంటే, గత కొంతకాలంగా నానితో సినిమా చేయడానికి చర్చలు జరుపుతున్న 'లక్కీ భాస్కర్' ఫేమ్ డైరెక్టర్ వెంకీ అట్లూరికి తాజాగా నాని గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ సమాచారం. వెంకీ అట్లూరి చెప్పిన ఫైనల్ నరేషన్ నానికి బాగా నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ ఈ క్రేజీ చిత్రాన్ని నిర్మించనున్నట్లు టాక్.ప్రస్తుతం వెంకీ అట్లూరి హీరో సూర్యతో చేస్తున్న 'విశ్వనాథ్ ఢ సన్స్' మూవీ పనుల్లో బిజీగా ఉండగా.. అటు సుజీత్ కూడా 'ఓజీ 2' ప్రాజెక్ట్‌పై వర్క్ చేస్తున్నాడు. మరి నాని-వెంకీ అట్లూరి కాంబినేషన్ మూవీని ఎప్పుడు ప్రకటిస్తారో చూడాలి.





# ఇలాంటి యాక్షన్ రాలేదు



'అందరూ 'టాక్సిక్' రిలీజ్ ఇన్నిసార్లు ఎందుకు వాయిదా పడిందనే విషయం గురించి మాట్లాడుతున్నారు. కానీ సినిమా కంటెంట్ ఎంత కొత్తగా ఉందో ఆలోచించడం లేదు. ఇలాంటి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తాయి' అని చెప్పింది కథానాయిక హ్యూమా ఖురేషి. యశ్ హీరోగా నటిస్తున్న 'టాక్సిక్' సినిమాలో ఆమె ఓ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆగస్ట్ 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా ఎట్టకేలకు రిలీజ్ డేట్‌ను కన్‌ఫర్మ్ చేసుకుంది. ఈ సందర్భంగా ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో హ్యూమా ఖురేషి సినిమా విశేషాలను పంచుకుంది.ఈ చిత్రంలోని కొన్ని భాగాలను మాత్రమే తాను చూశానని, భారతీయ సినిమాలో ఈ స్థాయిలో యాక్షన్‌ను ఇప్పటివరకూ చూడలేదని ఆమె చెప్పింది. 'ఇలాంటి సినిమాలు ఎప్పుడు రిలీజైనా సంచలనం సృష్టించడం ఖాయం. కంటెంట్‌తో పాటు మేకింగ్, యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకుల్ని అబ్బురపరుస్తాయి. కథలోని పాయింట్ కూడా ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుంది' అని హ్యూమా ఖురేషి తెలిపింది. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ సినిమా వివిధ భారతీయ భాషల్లో భారీ స్థాయి లో విడుదలకు సిద్ధమవుతున్నది.

# అఖిల్ అక్కినేని 'లెనిన్' లో తారక్ రోల్ ఏంటీ..

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని అఖిల్ లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడని తెలిసిందే. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ లాంచ్ చేసిన కొత్తపోస్టర్ అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తోంది.ఈ మూవీలో జూనియర్ ఎన్టీఆర్ కూడా భాగం కాబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. అదెలా అంటే తాజా పోస్టర్‌లో టైగర్ లుక్‌తో పాటు లెనిన్ టైటిల్ లోగోను చూడొచ్చు. ఇంతకీ ఈ కొత్త పోస్టర్ వెనుకున్న సీక్రెట్ ఏంటంటే.. ఈ చిత్రానికి యంగ్ టైగర్, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ అందించడమే కాకుండా సినిమా కథనాన్ని వివరించబోతున్నాడట. ఈ పోస్టర్‌తో సినిమాలో తారక్ రోల్ ఏంటనేది క్లారిటీ ఇచ్చేసినట్టేనని అర్థమవుతోంది.ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది.లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ప్లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు.




# దేశ చరిత్ర ఆధారంగా తీసిన సినిమా



'కొత్తవాళ్లమంతా కలిసి భారీ ఖర్చుతో ఈ కొత్త ప్రయత్నం చేశాం. అనంతపద్మనాభస్వామి తెరపై కనిపిస్తుంటే ప్రేక్షకులు చెప్పులు విడిచి చూస్తున్నారు. వారి కళ్లలో ఆనందభాష్పాలు కనిపిస్తున్నాయి. ఇంతకు మించిన భావోద్వేగం ఏముంటుంది? 'హరహర మహాదేవ' నినాదంతో థియేటర్లు మారుమోగుతుంటే ఇంతమించిన అనుభూతి ఏముంటుంది? దర్శకుడు అభిషేక్ గొప్ప విజన్‌తో ఈ సినిమా తీశారు. ముఖ్యంగా ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్,క్లైమాక్స్ ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకున్నాయి' అని హీరో విరాట్‌కర్ణ అన్నారు. ఆయన హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందిన పాన్ ఇండియా మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ 'నాగబంధం'. నభానటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలు. కిశోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది.ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన థాంక్స్‌మీట్‌లో హీరో విరాట్‌కర్ణ మాట్లాడారు. 'సినిమాకు అద్భుతమైన స్పందన వస్తున్నది. ఫస్టాఫ్‌లో కాస్త లెన్త్ ఎక్కువైంది. దాంతో ప్రేక్షకుల సలహా మేరకు కాస్త తగ్గించాం.క్లైమాక్స్ కూడా ట్రిమ్ చేశాం. ఇది ఫిక్షనల్ స్టోరీ కాదు. ఆఫ్ఘన్‌లు మన దేశంపై దాడికి తెగబడ్డప్పుడు. ఆది శంకరాచార్యులవారు నాగసాధువులనే వర్గాన్ని ఏర్పాటుచేసి, మన దేవాలయాలను రక్షించారు. మన చరిత్ర ఆధారంగానే తీసిన సినిమా ఇది. నేటి తరానికీ, రానున్న తరానికి కూడా మన చరిత్ర తెలియానే ఉద్దేశంతో చేసిన ప్రయత్నం ఇది' అని దర్శకుడు అభిషేక్ నామా పేర్కొన్నారు.

# అందుకే 'బ్లాస్ట్' ప్రమోషన్స్ చేయలేదు - నాగవంశీ

యాక్షన్ కింగ్ అర్జున్ నటించిన రీసెంట్ తమిళ బ్లాక్‌బస్టర్ 'బ్లాస్ట్' తెలుగులో 'బ్లాస్ట్ జోన్' పేరుతో విడుదలై పర్వాలేదనిపించింది. అయితే, ఈ చిత్రాన్ని తెలుగులో డిస్ట్రిబ్యూట్ చేసిన ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ దీనికి పెద్దగా ప్రమోషన్స్ చేయకపోవడం చర్చనీయాంశమైంది. తాజాగా 'లెనిన్' మూవీ ప్రమోషన్స్‌లో నాగవంశీ దీనిపై స్పందిస్తూ అసలు కారణాన్ని బయటపెట్టారు.ఆ సినిమా రిలీజ్ సమయంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' సినిమా రిలీజ్ అయింది. ఒకవేళ తాను 'బ్లాస్ట్ జోన్'ను అగ్రెసివ్‌గా ప్రమోట్ చేసి ఉంటే.. తాను మెగా ఫ్యామిలీని టార్గెట్ చేస్తున్నాడని అందరూ అనేవాళ్లు, అందుకే కావాలనే వెనక్కి తగ్గినట్లు నాగవంశీ క్లారిటీ ఇచ్చారు. ఒకవేళ గట్టిగా ప్రమోట్ చేసి ఉంటే ఈ సినిమా తెలుగు బాక్సాఫీస్ వద్ద మరింత బెటర్ కలెక్షన్స్ రాబట్టేదని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.





# 'లెనిన్' కి సాలిడ్ స్టార్ట్!



అక్కినేని అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్న అవైటెడ్ సినిమానే లెనిన్. అక్కినేని అఖిల్ హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కించిన ఈ రూరల్ మాస్ యాక్షన్ డ్రామా పట్ల ఇప్పుడు మంచి బజ్ నెలకొంది.ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్ లో చేస్తూ ఉండడం లేటెస్ట్ గా మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ కూడా రావడం వంటివి సినిమాకి అదనపు బూస్టప్ గా నిలిచాయి. ఇక ఇదిలా ఉండగా ఆల్రెడీ ఏపీలో బుకింగ్స్ స్టార్ట్ చేసుకున్న ఈ సినిమా సాలిడ్ స్టార్ట్ ని నమోదు చేస్తుంది అని చెప్పొచ్చు.డే 1 ఎర్లీ షోస్ అంతా కూడా దాదాపు మంచి ఆక్యుపెన్సీ లని ఈ సినిమా చూస్తోంది. సో లెనిన్ కి మంచి ఓపెనింగ్స్ వచ్చే అవకాశం ఉందని చెప్పొచ్చు. ఇక ఈ సినిమాకి థమన్ సంగీతం అందించడం జరిగింది అలాగే నాగవంశీ, కింగ్ నాగార్జునలు నిర్మాణం వహించారు.